ప్రజాశక్తి
శుక్రవారం 18 ఆగష్టు 2023 8 పేజీలు
ప్రకాశం బాపట్ల




దోచుకుందామని..దొరికిపోయారు..

- వీఆర్వో బంధువులకి భూముల ఆన్‌లైన్
- తహాశీల్దార్ సహా నలుగురు రెవెన్యూ అధికారుల సస్పెన్షన్



ప్రజాశక్తి-శింగరాయకొండ (మర్రిపూడి)

విఆర్ఒ బంధువులకు భూములను ఆక్రమంగా ఆన్‌లైన్ చేసిన విషయం రుజువు కావడంతో మర్రిపూడి తహాశీల్దార్‌తో సహా నలుగురు రెవెన్యూ అధికారులను కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం సస్పెండ్ చేశారు. మర్రిపూడి మండలం, పన్నూరు లోని సర్వే నెంబర్ 109/1, 171/ 1, 172/2 మరియు ఇతర సర్వే నెంబర్లలో 28 మందిని హక్కు దారులుగా, వారి వారసులుగా 91 మందిని గుర్తిం చారు. పన్నూరు వీఆర్వో డి శివారెడ్డి వారి పేర్ల మీద ఆన్లైన్‌లో నమోదు చేశారు. విజయవాడ- బెంగళూరు మధ్య గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ రోడ్డు పోయే ఈ భూములను గ్రామ రెవెన్యూ అధికారి శివారెడ్డి వారి బంధువుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ కనిగిరి ఆర్డీవోను విచారణ అధికారిగా నియమించి.. పూర్తిస్థాయి నివేదికను తెప్పించుకున్నారు. రెవెన్యూ అధికారి ఇచ్చిన నివేదికలో మర్రిపూడి మండలం పన్నూరు గ్రామ సర్వేనెంబర్ 12-2, 169-1తో పాటు ఇతర సర్వే నెంబర్లు మొత్తం 143 ఎకరాలా 29 సెంట్ల పట్టా భూమికి వీఆర్వో డి.శివారెడ్డి, ఆర్ఐ ఎంవిఎం శేషాచలం అసలైన వారసులకు కాకుండా, అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించకుండా ఫ్యామిలీ ట్రీ అను ఒక పత్రం తయారుచేసి 65 మందికి పట్టాదారు పాసుపుస్తకాలు కోసం సిఫార్సులు చేసి ఉన్నారని తేల్చారు. రెవెన్యూ రికార్డులు పరిశీలించకుండా అధికారులు క్షేత్రస్థాయిలో భూములు తనిఖీ చేయకుండా చట్ట విరుద్ధముగా అప్పటి తహసిల్దార్ ప్రస్తుత డిప్యూటీ తహసిల్దార్ జి జగదీశ్వరరావు సదరు 65 మంది పేరు మీద పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయటానికి ఉత్తర్వులు జారీ చేసి ఉన్నారని తెలిపారు. ప్రస్తుత తహాశీల్దార్ సిహెచ్ కష్ణారావు ఆ భూముల్లో 71 ఎకరాల 75 సెంట్లు భూమిని వెబ్ ల్యాండ్ నందు నమోదు చేసి గ్రామ రెవిన్యూ అధికారి శివారెడ్డి బంధువుల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయించి ఉన్నారని కనిగిరి ఆర్డీవో నివేదిక ఇచ్చారు. ఈ నివేదిక ఆధారంగా జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం మర్రిపూడి తహాశీల్దార్ సిహెచ్ కష్ణారావును, పూర్వ తహాశీల్దార్, ప్రస్తుత డిప్యూటీ తాహసిల్దార్ జి జగదీశ్వరరావును, ఇన్‌ఛార్జి ఆర్ఐ ఎంవిఎం శేషాచలంను, పన్నూరు వీఆర్వో డి శివారెడ్డిని సస్పెండ్ చేశారు.

కీచక గురువు


కీచక టీచర్‌కు దేహశుద్ధి చేస్తున్న గ్రామస్తులు

- విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన
- దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

జిల్లాకు రూ.35.45 కోట్ల టిటిడి నిధులు

- చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి హయాంలో విడుదల
- కల్యాణ మండపాలు, దేవాలయాల ఆధునీకరణకు వినియోగం

2024లో చంద్రబాబు కథ ముగుస్తుంది..

- వైసిపి 151 స్థానాలు గెలుచుకుంటుంది..
- అభ్యర్థులను ప్రకటించే హక్కు కేవలం సిఎంకే..
- పార్టీ సీనియర్ నేత, ఎంపీ విజయసాయిరెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

2024లో చంద్రబాబు కథ ముగుస్తుందని, ఆయన కల చెదిరిపోయి.. కన్నీటితోనే శేషజీవితం గడపాల్సిన పరిస్థితి వస్తుందని వైసిపి సీనియర్ నేత, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. గురువారం బాపట్లలోని కోన భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వుంది తెలుగుదేశం పార్టీ కాదని, అది తెలుగు దొంగల పార్టీ అని చెప్పారు. చంద్రబాబు అసత్యాలను వల్లెవేస్తూ హరిశ్చంద్రుడిలా ఫోజులిస్తున్నాడని, 2లో

2024లో చంద్రబాబు కథ ముగుస్తుంది..

(మొదటిపేజీ తరువాయి)

టీడీపీ నేతలు అధికార దాహంతో దేశ ద్రోహానికీ వెనుకాడరని పేర్కొన్నారు. వేర్పాటువాద పార్టీలతో స్నేహం కోసం అర్రులు చాస్తున్నారని, అసాంఘిక కార్యకలాపాలకు మద్దతు పలికే టీడీపీ గుర్తింపును ఎన్నికల కమిషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ని చేసినా చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలన్నారు. బాపట్ల జిల్లాలో పార్టీకి సంబంధించిన ముఖ్యనాయకులతో సమావేశం అయ్యి రానున్న ఎన్నికలకు పార్టీ బలోపేతం దిశగా చర్చలు జరిపానని, క్షేత్ర స్థాయిలో వైఎస్సార్సీపీకి పూర్తి బలం ఉందని, 151 స్థానాలకు ఒక్క సీటు తగ్గకుండా ఇంకా ఎక్కువ వస్తాయనే బలమైన నమ్మకం తమకుందన్నారు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్రంలోని 87 శాతం కుటుంబాలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారని, ప్రజలంతా వైఎస్సార్సీపీకి మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బాపట్ల జిల్లా చాలా క్లిష్టమైన జిల్లా అని, గతంలో అద్దంకి, చీరాల, రేపల్లె, పర్చూరు నియోజకవర్గాలు పోగొట్టుకున్నామని, వాటితో పాటు ఈ సారి వేమూరు, బాపట్ల కలిపి ఆరు నియోజకవర్గాల్లో వైఎస్సార్సీపీ విజయబావుటా ఎగురవేస్తామని పేర్కొన్నారు. చంద్రబాబు విజన్ 2020 అన్నాడని, అది అయిపోయిందని, ఇప్పుడు విజన్ 2047 అంటున్నాడని, 2047 నాటికి చంద్రబాబు ఏ పరిస్థితుల్లో ఉంటాడో మీరే ఊహించుకోండని చెప్పారు. 2024 తర్వాత తెలుగుదేశం పార్టీ అంతర్ధానం అవుతుందని, కొత్త రాజకీయ పార్టీలు పుట్టుకొస్తాయని, ఇక లోకేశ్‌కి కూడా భవిష్యత్తు లేదని చెప్పారు.

ఇన్‌ఛార్జిల మధ్య సమన్వయం సాధిస్తాం..

బాపట్ల జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తల మధ్య సయోధ్య సాధిస్తామని రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి అన్నారు. చీరాల నియోజకవర్గం నుంచి కరణం వెంకటేష్ గానీ, పర్చూరు నుంచి ఆమంచి కష్ణమోహన్ గానీ, అద్దంకి నుంచి కష్ణచైతన్య గానీ ఎవరైనా సరే ఈ మూడు నియోజకవర్గాలకు సంబంధించి వారివారి నియోజకవర్గ పరిధిలో పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు వారు పనిచేసుకోవడం జరుగుతుందన్నారు. ఒక సమన్వయకర్త ఇంకొక సమన్వయకర్త నియోజకవర్గంలో జోక్యం చేసుకునేటటువంటి ప్రసక్తి ఉండదన్నారు. ఒకరికి ఒకరు మద్దతుగా వుంటారని చెప్పారు. ఇంకొక నియోజకవర్గంలో వీళ్ళకి సంబంధించినటువంటి అభిమానులు ఎవరైనా ఉంటే వాళ్లకి పార్టీ తరఫున విజ్ఞప్తి చేయడం జరుగుతుందన్నారు. చిన్నచిన్న సమస్యలు ఏదైనా ఉంటే వాటిని పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు.

వైసీపీ అభ్యర్థుల ప్రకటన చెయ్యలేదు..

బాపట్ల జిల్లాలో జరిగిన వైసీపీ నియోజకవర్గ సమీక్షల్లో జిల్లాలో ఏ అసెంబ్లీ నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థులను ప్రకటించలేదని విజయసాయిరెడ్డి చెప్పారు. 2024 ఎన్నికల్లో బాపట్ల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కోన రఘుపతిని ప్రకటించామని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు. అభ్యర్థుల పేర్లన్నీ ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటిస్తారని, రాష్ట్రంలో అభ్యర్థులను ప్రకటించే హక్కు కేవలం ముఖ్యమంత్రికే ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో మంత్రి మేరుగు నాగార్జున, జిల్లా వైసీపీ అధ్యక్షులు మోపిదేవి వెంకట రమణ, చీరాల వైసీపీ ఇంచార్జి కరణం వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు ఖాదర్‌వలి

ఆప్కాస్ వర్కర్స్‌ను పర్మినెంట్ చేయాలి

కనిగిరి : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం కనిగిరి పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంను ఉద్దేశించి సిఐటియు జిల్లా నాయకులు పిసి కేశవరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎస్‌కె ఖాదర్‌వలి మాట్లాడుతూ సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, సిపిఎస్ రద్దుచేయాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18500 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశదోరణి అవలంభించటం దారుణమని పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేయటం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్ ప్రసాద్, లక్ష్మయ్య, జి ఓబయ్య, వి మార్క్, ఎలీషా, దస్తగిరి, గరటయ్య తదితరులు పాల్గొన్నారు.

50 బేళ్లు తిరుగుముఖం

కొండపి : కొండపి పొగాకు వేలం కేంద్రంలో గురువారం నాడు ఇంటికి తిరుగుముఖం పట్టిన పొగాకు బేళ్లు 50 ఉన్నాయని వేలం నిర్వహణాదికారి ఎస్.రామారావు తెలిపారు. వేలం కేంద్రానికి అయ్యపురాజుపాలెం, నరసరాజుపాలెం, పెదకండ్లగుంట, నేతివారిపాలెం, రామచంద్రపురం గ్రామాలకు చెందిన పొగాకు రైతులు 903 బేళ్లను అమ్మకానికి ఉంచారు. అందులో 853 బేళు కొనుగోలు చేయగా మిగిలిన 50 బేళ్లు వివిద కారణాల చేత ఇంటికి తిరుగుముఖం పట్టాయి. అత్యధిక ధర కిలో రూ.272, అత్యల్ప ధర కిలో రూ.150, సరాసరి ధర కిలో రూ.262.04 పలికిందన్నారు.

దొంగ ఓట్లపై దృష్టి సారించాలి

కనిగిరి : కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్‌లో గురువారం బిఎల్‌ఏల సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో ఇంటింటికి జరుగుతున్న ఓటర్ల జాబితా పరిశీలనలో బిఎల్‌ఏలది కీలక పాత్ర అని అన్నారు. సెప్టెంబర్ 21వరకు ఓటర్ వెరిఫికేషన్ జరుగుతుందని, బిఎల్‌వోలు పరిశీలన చేసేటప్పుడు బిఎల్‌ఏలు తప్పని సరిగా పాల్గొనాలని, దొంగ ఓట్లపై దృష్టిపెట్టి తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎప్పటికప్పుడు బిఎల్‌వోల నుంచి సమాచారం తెలుసుకోవాలన్నారు. బిఎల్‌వోలు పక్షపాతదోరణి వ్యవహరించినా, అవకతవకలకు పాల్పడినా అప్రమత్తంగా ఉండి తన దృష్టికి తీసుకురావాలన్నారు.

అర్హులందరికీ వైఎస్ఆర్ బీమా వర్తింపజేయాలి

డిఆర్‌డిఎ పీడీ రవికుమార్

ప్రజాశక్తి-మార్కాపురం

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ వైఎస్ఆర్ బీమా వర్తింపజేయాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ రవికుమార్ కోరారు. స్థానిక ఎస్సీబిసి కాలనీలో గల డ్వాక్రా బజారులో మార్కాపురం డివిజన్‌లోని సచివాలయంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లకు వైఎస్ఆర్ బీమా పథకంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఎల్‌డిఒ బివిఎన్ సాయికుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన డిఆర్‌డిఎ పిడి రవికుమార్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో అధికారులు గ్రామంలోని మరణాల వివరాలను వెంటనే తెలుసుకోవాలన్నారు. మరణించిన వారి కుటుంబాలకు వైఎస్ఆర్ బిమా త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరణించిన వ్యక్తి దహణ సంస్కారాలకు ముందుగా మట్టి ఖర్చుల నిమిత్తం పైకం అందించాలన్నారు. ప్రభుత్వం పేదల కోసం సంక్షేమ అభివద్ధిని కొనసాగిస్తోందన్నారు. డిల్ డిఓ సాయికుమార్ మాట్లాడుతూ వెల్ఫేర్ అసిస్టెంట్లు వాలంటీర్ల సహకారంతో అర్హత కలిగిన వారిని గుర్తించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో లేదో పరిశీలించాలన్నారు. లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ బీమా డిపిఎం కష్ణకుమారి, మార్కాపురం డిఆర్‌డిఎ వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం రమేష్‌బాబు, ట్రైనర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యావ్యాపారానికి వ్యతిరేకంగా పోరాటం : ఎస్ఎఫ్ఐ



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-చీమకుర్తి

జాతీయోద్యమస్ఫూర్తితో విద్యార్థులు విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా పోరాటాలకు సన్నద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం స్థానిక దాచూరి రామిరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జి దేవరాజ్ అధ్యక్షత వహించారు. సదస్సులో కంకణాల ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటాలలో విద్యార్థులు, యువకుల పాత్ర కీలకమైందన్నారు. వేలాది మంది యువకులు, విద్యార్థుల ప్రాణాలు, త్యాగాల ఫలితమే నేటి స్వతంత్ర భారతదేశమన్నారు. కానీ వాటి ఫలితాలు కొందమంది మాత్రమే అనుభవిస్తున్నారన్నారు. విద్యా, ఉపాధి రంగాలు అందని ద్రాక్షలా మారిందని తెలిపారు. నూతన విద్యావిధానం పేరుతో విద్యారంగాన్ని పూర్తిగా ప్రైవేటు, కాషాయీకరణపరం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థల్ని కారుచౌకగా అమ్మేస్తున్నారన్నారు. అందరికీ విద్య ఉపాధి కోసం పోరాటం చేయడమే స్వాతంత్ర సమరయోధులకు మనం ఇచ్చే ఘనమైన నివాళన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ మాట్లాడుతూ చీమకుర్తి పట్టణంలో మైనింగ్ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలనీ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలనీ కోరారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు క్రిష్టిపాటి చిన్నపురెడ్డి, పి వెంకటరావు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధికే పెద్దపీట : మద్దిశెట్టి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి

ప్రజాశక్తి-దరిశి

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. గురువారం మండలంలోని పెదఉయ్యాలవాడ దగ్గర రూ. 50 లక్షలతో ముసినదిపై బ్రిడ్జి నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో గతంలో ఎన్నడు లేనివిధంగా సంక్షేమానికి పెద్దపీట వేశారని 95 శాతం హామీలు అమలు చేశారని ఆయన పేర్కొన్నారు. అంతకముందు దరిశి నగరపంచాయతీ 5వ వార్డులో, 7వ వార్డులోని కొత్తరెడ్డిపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పెద్దఉయ్యాలవాడలో సచివాలయం వద్ద ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మొక్కలు నాటారు. కొత్తపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన మాజీ సర్పంచ్ ఇల్లూరి గాలిరెడ్డి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమాలలో ఎంపిపి గోళ్లపాటి సుధారాణి అచ్చయ్య, నగరపంచాయితీ వై మహేష్, మండల కన్వీనరు వెన్నపూస వెంకటరెడ్డి, రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టరు కుమ్మిత అంజిరెడ్డి, జెసిఎస్ మండల ఇన్‌చార్జి మరియు పిఎసిఎస్ చైర్మన్ బత్తినేని వెంకటేశ్వర్లు, సర్పంచులు రాము, కౌన్సిలర్లు ఆవుల జ్యోతి, పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నుంచి మార్కాపురం వైపుకు వెళ్లే జాతీయ రహదారి 565 రోడ్డుకు కుడి వైపున హైవే వారు ఏర్పాటు చేసిన రెస్ట్ రూమ్ పక్కన పడమర వైపున పొలాల్లోకి వెళ్ళే మట్టి రోడ్డుకు ఎడమ వైపున వర్షపు నీరు వెళ్లేందుకు గానూ రోడ్డ పక్కన 3 నుండి 5 సంవత్సరాల వయస్సు గల ఒక గుర్తు తెలియని బాలుని మతదేహం పడి ఉన్నదని యర్రగొండపాలెం సిఐ కె.మారుతీకృష్ణ తెలిపారు. విఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన గురువారం తెలిపారు. మృతి చెందిన బాలుని శరీరంపై బ్లూ కలర్ టీ షర్టు దానికి మాచింగ్ డ్రాయర్ ఉండి దానిపై అంకెలు, ఇంగ్లీష్ అక్షరాలు, ఫుట్ బాల్ సింబల్ కలిగిన డిజైన్స్ ఉన్నాయని చెప్పారు. మృతుడు సుమారు మూడు రోజుల క్రితం చనిపోయినట్లుగా ఉందని చెప్పారు. యర్రగొండపాలెంతో పాటు మండలంలో ఎక్కడైనా, ఎవరైనా తల్లిదండ్రులు గొడవలు వల్ల పిల్లలను తీసుకొని వెళ్ళినట్లు గానీ, ఏదైనా ప్రమాదవశాత్తు ఎవరైనా బాలుడు మరణించడం వల్ల గానీ, ఎవరైనా పిల్లలు కనిపించకుండా పోయినట్లు గానీ సమాచారం ఉంటే తెలియజేయాలని ఆయన కోరారు. ఇచ్చిన గోప్యంగా ఉంచుతామన్నారు. ఖచ్చితమైన సమాచారం ఇచ్చిన వారికి బహుమానం అందజేస్తామని తెలిపారు. ఎస్సై 9121102193, సిఐ 9121102192, డిఎస్పీ మార్కాపురం 9121102180 తో పాటు 100కు సమాచారం ఇవ్వాలని చెప్పారు.



మాట్లాడుతున్న సిఐ మారుతీకృష్ణ



తాగునీటి కోసం మహిళలు ధర్నా



తాగునీటి కోసం ధర్నా చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-పొదిలి

గుక్కెడు మంచినీళ్లు ఇవ్వలేని నాయకులు ఎందుకంటూ మహిళలు పట్టణంలో ఖాళీ బిందెలతో నిరసనలు తెలియజేశారు. మంచినీటి కోసం రోడ్డెక్కారు. గత 15 రోజులుగా సాగర్ మంచినీళ్లు సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామంటూ ప్రజలు ఖాళీ బిందెలతో పోలీస్ స్టేషన్ సమీపంలో రోడ్డుపై బైఠాయించారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ జరిగింది. ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పట్టణంలో సాగర్ మంచినీరు సరఫరా సక్రమంగా లేక ఫీవర్ ఇబ్బందులు పడుతున్నామంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

ఎమ్మెల్యే కుందూరు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ :

మరో వైపు పొదిలి పట్టణంలో మార్కాపురం ఎమ్మెల్యే కుందూరు నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా నాగార్జున రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజా సంక్షేమ లక్ష్యంగా పేదలకు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీలో పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు కాబోయే సిఎం జగన్మోహన్ రెడ్డి అంటూ నినాదాలు చేస్తూ పట్టణంలో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కణజాల సంస్థ డాక్టర్ కేసిరెడ్డి వెంకటరమణారెడ్డి, మండల పట్టణ వైసిపి అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని గార్లదిన్నె పంచాయతీలోని వైసిపికి చెందిన 15 కుటుంబాల వారు గురువారం జవాజి బాషాపతినాయుడు, కుందూరు కాశిరెడ్డిల ఆధ్వర్యంలో మార్కాపురం మాజీ శాసనసభ్యులు నారాయణరెడ్డి సమక్షంలో ఆయన స్వగృహంలో టిడిపి పార్టీలో చేరారు. 15 కుటుంబాల వారికి కందుల నారాయణరెడ్డి టిడిపి కండువాలను వేసి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి పార్టీకి విధేయులుగా ఉండి, భవిష్యత్తులో పార్టీ గెలుపుకు అంకితభావంతో పని చేసి మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి గెలిపించుకుంటామని ధీమా వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో మేకల సామెల్, సిరిపురం మరియదాస్, మొండితోక కాశయ్య, పట్నం సుబ్బారావు, వెంకటేశ్వర్లు, కాశయ్య, వెంకటయ్య, చిన్నకాశయ్య, కొండయ్య, పవన్‌లు తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు : పట్టణంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి ఇన్చార్జ్ ముత్తుముల అశోక్ రెడ్డి సమక్షంలో అర్ధవీడు మండలం రంగాపురం గ్రామానికి చెందిన 20 ఎస్సీ కుటుంబాల వారు మండల అధ్యక్షులు బండ్లమూడి ఆంజనేయులు యాదవ్ ఆధ్వర్యంలో గురువారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎన్నికలకు ముందు ఎస్సి సోదరులకు ఈ వైకాపా పెద్దలు కల్లబొల్లి మాటలు చెప్పి వారి ఓట్లతో అధికారంలోకి వచ్చి మొదటి రోజు నుంచి ఎస్సీ సోదరుల పై రాష్ట్రంలో నిత్యం ఏదో ఒకచోట దాడులు చేస్తూ వారిని వేధించడమే పనిగా పెట్టుకుందని అన్నారు. తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలిచి గిద్దలూరు నియోజకవర్గంలో అశోక్ రెడ్డి గెలుపుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీలో చేరిన ఎస్సీ సోదరులు గొట్టేముక్కల రామ్మోహన్, చాట్ల రాజారత్నం, పానుగంటి బాబు, సురేష్, గిలిగిత్తల నడిపయ్య, రాజులయ్య, విజయ్, టీడీపీ మండల క్లస్టర్ ఇంచార్జ్ మారెడ్డి రంగారెడ్డి, మండల బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లాకా రమణ యాదవ్, మీనిగే రాము, సయ్యద్ బాషా, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి రాక



మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శుక్రవారం యర్రగొండపాలెం రానున్నారు. యర్రగొండపాలెం పట్టణంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు సచివాలయాల కన్వీనర్లకు, గహసారధులకు సమావేశం ఏర్పాటు చేసినట్లు వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గహసారధులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు. అలాగే సాయంత్రం 4 గంటలకు త్రిపురాంతకం మండలం మిరియంపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి సురేష్ పాల్గొననున్నారు.

డిజిటల్ పేమెంట్లతో పన్నుల వసూలు

ప్రజాశక్తి-పెదదోర్నాల

పెద్దదోర్నాల మేజర్ గ్రామ పంచాయతీలో గురువారం డిజిటల్ పేమెంట్ల ద్వారా పన్నులు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శి మోహన్‌రావు తెలిపారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ చిత్తూరు హారిక మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గో క్యాష్ లెస్ నో క్యాష్ అనే నినాదంతో నూతన విధానానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. నగదు రహిత చెల్లింపులు చెల్లించి గ్రామపంచాయతీకి సహకరించాలని కోరారు. గ్రామపంచాయతీకి ఆదాయం పెరిగే విధంగా ప్రజలు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దూదేకుల రసూల్, గ్రామపంచాయతీ సిబ్బంది ఖాసిం, యేసు, గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీచైర్స్ పంపిణీ

ప్రజాశక్తి-పిసిపల్లి

దాతల సహకారం మరువలేనిదని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి.అంజనీదేవి అన్నారు. మండలంలోని నేరేడుపల్లి జడ్‌పి హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠశాల పూర్వపు విద్యార్థి, ప్రస్తుతం జర్మనీలో వుంటున్న మీసరగండ్ల బ్రహ్మయ్య పాఠశాల విద్యార్థులకు స్టడీచైర్స్, కుర్చీల మీద వాడుకునే అట్టలను అందజేశారు. పాఠశాల అభివద్ధికి పూర్వపు విద్యార్థులు, గ్రామస్తులు సహకారం మరువలేనిదని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గ్రామస్తుల సేవలను కొనియాడారు. 25మంది విద్యార్థులకు రూ.25వేల విలువ చేసే వాటిని బ్రహ్మయ్య, వారి తల్లిదండ్రులు, రమణయ్య, అనంత లక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటి చైర్మన్ గుజ్జుల రమణారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో నేడు ఉదయం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి మోరబోయిన మురళీకష్ణ అధ్యక్షతన నిర్వహిస్తారని ఎంపిడిఓ అద్దంకి శ్రీనివాస్‌మూర్తి గురువారం తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు విధిగాహాజరు కావాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని తనుబొద్దివారిపాలెం, చిమాటావారిపాలెంలో పేకాట శిబిరాలపై పోలీసులు గురువారం దాడి చేశారు. పేకాడుతున్న 12మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.30,850నగదు స్వాదీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హానోకు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టను గురువారం భట్టిప్రోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వం కేటాయించిన రిచ్ ల నుండి మాత్రమే ఇసుకను తరలించాలని అది కూడా తప్పనిసరిగా బిల్లు కలిగి ఉండాలని ఎస్ఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పునుకొంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-భట్టిప్రోలు

చేసిన అప్పులు తీర్చలేక, ఆరోగ్యం చెడిపోవటంతో మనస్తాపానికి గురై వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య కు పాల్పడ్డ ఘటన వెల్లటూరులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కొల్లూరు మండలం ధోనీపూడి గ్రామానికి చెందిన అరిగా ప్రసాద్ (49) అనే వ్యక్తి మద్యానికి బానిసై చేసిన అప్పులు తీర్చలేకపోవటమే కాకా అనారోగ్య సమస్యలు ఉండటం వలన భయంతో మనస్తాపానికి గురై ఈ నెల 16 వ తేదీన వెల్లటూరు లాక్ సెంటర్లో వంతెన వద్ద పురుగుల మందు సేవించాడు. అప్పటి నుండి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



డిఎస్‌పిని కలిసి వస్తున్న సిపిఎం నాయకులు

నిష్పక్ష పాతంగా విచారించాలి : సిపిఎం

చీరాల : వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ రోశయ్య కాలనీకి చెందిన డక్కుమళ్ళ రోహిణి హత్య కేసులో నిష్పక్షపాతంగా విచారించి నిందితులను శిక్షించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్, ఎన్ బాబురావు డిమాండ్ చేశారు. వివాహిత హత్య కేసుపై సిపిఎం నాయకులు డిఎస్పి ప్రసాదరావును కలసి మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. అదనపు కట్నం తేవాలని వేధించి హత్య చేసిన భర్తతో పాటు అత్త, మామలను, భర్త అన్నయ్య, వదినలను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతదేహాన్ని చీరాల ప్రభుత్వ వైద్యశాలలో సందర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. నిందితులకు శిక్షలు పడకపోతే ఆందోళన చేస్తామన్నారు. అనుమానాలతో భర్త, కుటుంబ సభ్యులు వేధించారని ఆరోపించారు. డిఎస్‌పిని కలిసిన వారిలో సిపిఎం నాయకులు పి కొండయ్య, పి నాగమల్లేశ్వరరావు ఉన్నారు.



ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

కార్మికులకు జీతాలు ఇవ్వాలి : సిఐటియు

చీరాల : మండలంలోని వాడరేవు పంచాయతీ కార్మికులకు 14నెలల జీతాల బకాయిలు ఉన్నాయని, వెంటనే బకాయిలు చెల్లించి కార్మికులు చేస్తున్న సమ్మెను నివారించాలని ఎంపిడిఓ కార్యాలయం వద్ద కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అధికారులు దృష్టికి తీసుకువచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. ధర్నానుద్దేశించి సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు మాట్లాడారు. గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం, పర్యావరణాన్ని కాపాడుతూ చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు తమను పట్టించుకోకపోతాయా అనే ఆశతో పనిచేస్తున్నారని అన్నారు. కరోనా కాలంలో ఫ్రంట్ లైన్ వారియర్స్ అని బిరుదు ఇచ్చారని, నేడు పంచాయతీ కార్మికులను పట్టించుకోవటం లేదని అన్నారు. అనివార్యమైన పరిస్థితుల్లో సమ్మెలో ఉన్న కార్మికుల వేతనాలు ఇచ్చి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు కె పోతురాజు, కె ఆంజనేయులు, చెంచయ్య, సురేష్, మరియమ్మ, నాగమ్మ, భాగ్యం పాల్గొన్నారు.

పంట నమోదు తప్పని సరి

పర్చూరు : ఖరీఫ్ సీజన్‌లో పంట సాగు చేసిన రైతులకు పంట నమోదు కార్యక్రమం చేపట్టాలని వ్యవసాయ అధికారి ఎస్ రామ్మోహన్‌రెడ్డి కోరారు. మండలంలోని అన్ని గ్రామాలలో పంట నమోదు కార్యక్రమం మొదలైందని తెలిపారు. కౌలు రైతులు కూడా సాగుచేసిన పంటను కౌలు రైతుల పేరిట పంట నమోదు చేస్తారని అన్నారు. పంట నమోదు చేయించు కోక పోతే ప్రభుత్వం ద్వారా వచ్చే పంట నష్ట పరిహారం, పంటల భీమా, మద్దతు ధరకు పండించిన ఉత్పత్తిని అమ్ముకోవడానికి అర్హులు కారని ప్రకటించారు.

వాలంటీర్లకు ఇంటర్వ్యూలు

చీరాల : మున్సిపల్ కార్యాలయంలో వార్డు వాలంటీర్ల ఎంపికకు అభ్యర్థులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 12 పోస్టులకు 44మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ కే రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వివిధ కారణాలతో 12పోస్టులు ఖాళీలు కావడంతో ఇంటర్వ్యూలు నిర్వహించామని అన్నారు. ఎంపిక కాబడినవారికి ఈనెల 19న నియామక పత్రాలు అందజేసి 21నుంచి వీధుల్లోకి తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో టిపిఒ లక్ష్మి పాల్గొన్నారు.

రేషన్ మాఫియా @ చీరాల

- లారీలకొద్ది రేషన్ బియ్యం అక్రమ రవాణా
- అధికారుల కనుసన్నల్లో అక్రమాలు
- రేషన్ మాఫియా, అధికారులు, రాజకీయపెద్దల సిండికేట్
- నెలకు రూ.3లక్షలకుపైగా చేతులు మారుతున్న వైనం
- అంతా ఒక్కటే... అడ్డుకునేదెవరు.?

ప్రజాశక్తి - చీరాల

పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం పెద్దలకు ఆదాయ వనరు అయ్యింది. గతంలో అద్దంకికి చెందిన వాళ్లఅక్రమ తరలింపులు చేస్తుండగా తాజాగా చీరాల పాత కాపులే మళ్లీ అక్రమ తరలింపులకు సిద్ధమయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కీలకమైన వ్యక్తులను సంతృప్తి పర్చి అక్రమాలకు రాజమార్గం వేసుకున్నారనే ప్రచారం చీరాల పట్టణంలో సర్వత్రా వినిపిస్తుంది. ఈపూరుపాలెం నుండి బాపట్ల వైపు మినీ ట్రక్కులో సుమారు 70బస్తాల రేషన్ బియ్యాన్ని ఆపి అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ సకాలంలో ఎవ్వరూ స్పందించకపోవడం చేస్తే అక్రమాలు ఏ స్థాయిలో జరుగుతు న్నాయో తెలుస్తుంది.

చీరాల కేంద్రంగా దశాబ్దాలుగా రేషన్ బియ్యం రవాణా అవుతూనే ఉంది. అక్రమ వ్యాపారుల మధ్య గొడవలతో ఎవరైనా బయటపెట్టుకుంటేనో అధికారల్లో ఎవరైనా జోక్యం చేసుకున్నప్పుడో మాత్రమే అక్రమాలు దొరుకుతున్నాయి. దొరికి అక్రమాలు కూడా అంతలోనే జారిపోతున్నారు. నిజాయితీ కలిగిన అధికారులెవ్వరైనా గట్టిగా పట్టుకుంటే ఆ అధికారి ఆ పోస్టులో కొద్దిరోజులే ఉంటారు. ఆ తర్వాత ఏదో పోస్టుకు బదిలీ అవుతారు. అంటే రేషన్ మాఫియా ఎంత బలమైన వ్యక్తులో అర్థం చేసుకోవడానికే ఇలాంటి ఉదాహరణలు పనికొస్తాయి.

వరుస దాడులు... ఆగని అక్రమాలు

క్రింది స్థాయి అధికారులు చేస్తున్న దాడులు కొందరు న్నతాధికారుల అవసరాలు తీరుస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో విజిలెన్స్, ఎన్స్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాత్రుల్లో కాపు కాచి పట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోతుంది.

ఎక్కడికీ... ఈ బియ్యం

రేషన్ బియ్యం లారీల కొద్ది ఎక్కడికె ళుతున్నాయనేది ప్రశ్నగా మారింది. చీరాల, కారంచేడు, స్వర్ణ, పర్చూరు, ఈపూరుపాలెం ప్రాంతాల్లోని రైస్ మిల్లుల కేంద్రంగా రేషన్ బియ్యం నిల్వలు ఉంచుతున్నారు. అక్కడే కొందరు గోతాలు మార్చి తరలిస్తుండగా బాగా పలుకుబడి కలిగిన అక్రమ వ్యాపారులు మాత్రం కనీసం గోతాలు కూడా మార్చకుండానే తరలిస్తున్నారు. కొందరు రీ పాలిష్ చేసి ఓపెన్ మార్కెట్‌లో కేజీ రూ.42లకు 74రకం బియ్యం కింద అమ్మేస్తుండగా మరికొందరు నేరుగా కాకినాడ పోర్టుకు తరలిస్తున్నారు.

తాజాగా... పట్టుబడిన రేషన్ బియ్యం

ఈపూరుపాలెం సెంటర్లోని రేషన్ దుకాణం వద్ద మినీలారీకి 70బస్తాల రేషన్ బియ్యం లోడ్ చేశారు. ఆ ట్రక్కు ఈపూరుపాలెం నుండి బాపట్లవైపు వేకువ జామున బయలుదేరింది. సమాచారం తెలుసుకున్న ప్రజాశక్తి ఆవాహనాన్ని అడ్డుకుంది. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వచ్చే వరకు అక్కడే వేచి ఉండగా ఉన్నట్లు ఆ వాహన డ్రైవర్ వాహనాన్ని అక్కడి నుండి సినీ పక్కీలో ఉడాయించారు. ఆలస్యంగా వచ్చిన అధికారులు, పోలీసులు ఆ ట్రక్కు కోసం గాలిస్తున్నారు.



రేషన్ అక్రమ రవాణా చేస్తున్న మినీ ట్రక్కు

అక్రమ రవాణాపై కఠిన చర్యలు : ఎస్ఐ



రేషన్ అక్రమ రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుం టామని ఈపూరు పాలెం ఎస్ఐ జనార్ధన్ తెలిపారు. ఈపూరుపాలెం నుండి బాపట్ల వైపు రేషన్ బియ్యంతో ట్రక్కు వెళు తుందని సమాచారం అందిన వెంటనే తమ సిబ్బంది స్పందించారని తెలిపారు. రూరల సిఐ మల్లికార్జునరావు ఆదేశాలతో తమ సిబ్బంది వెళ్లేలోపు ఆ ట్రక్కు అక్కడి నుండి వెళ్లిపోయిందని అన్నారు. తమ సిబ్బంది ట్రక్కుకోసం గాలిస్తున్నారని, ఎక్కడున్నా పట్టుకుం టామని తెలిపారు. రేషన్ అక్రమాలు అడ్డుకునేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

అధిష్టానం చూపిన అభ్యర్థిని గెలిపించాలి

రీజనల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి - అద్దంకి

అధిష్టాన నిర్ణయాన్ని ఆమోధించి ప్రకటించిన అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని రాజ్యసభ సభ్యులు, బాపట్ల జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి అన్నారు. బాపట్ల కోన భవన్‌లో అద్దంకి నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా మీడియా కెక్కినా, గ్రూపులు కట్టినా క్రమశిక్షణా చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. సస్పెండ్ చేస్తామని హెచ్చరించి నట్లు తెలిసింది. అద్దంకిలో ప్రస్తుత పరిస్థితులు పార్టీకి చాలా అనుకూలంగా ఉన్నాయని అన్నారు. ఉమ్మడిగా కృషి చేస్తే 20వేల మెజారిటీ వచ్చే అవకాశం ఉందన్నారు. గతంలో అసంతృప్తితో ఉన్న కొంతమందిపై మీద తీసుకున్న క్రమశిక్షణా చర్యలను ఉపసంహరిస్తామన్నారు. తిరిగి వారిని పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తామన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజలతో ఏర్పడ్డ సంబంధాలను ఓట్లగా మలచాల్సిన



అద్దంకి కార్యకర్తల సమావేశంలో విజయసాయిరెడ్డి

బాధ్యత కార్యకర్తలదేనని అన్నారు. ప్రస్తుతం గెలిచిన నేత పార్టీకి నమ్మకద్రోహం చెసారని అన్నారు. ఆయన్ను ఓడించడమే అందరి లక్ష్యంగా ఉండాలని పరోక్షంగా గొట్టిపాటి రవికుమార్ నుద్దేశించి వ్యాఖ్యనించినట్లు తెలిసింది. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు మోపిదేవి వెంకట రమణ, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, అద్దంకి ఇంచార్జి బాచిన కృష్ణ చైతన్యతోపాటు మండలాల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వివిధ హెూదాల్లో ఉన్న నాయకులు, అసంతృప్తి వాదులు ఉన్నారు.



అవార్డు అందుకుంటున్న సాయిశ్రావణి

డిజైనర్‌కు జాతీయ అవార్డు

ప్రజాశక్తి - చీరాల

ఉత్తమ ఇంటీరియర్ డిజైనర్‌గా తెలుగు రాష్ట్రాలనుండి ఆరుగునికి ఎంపిక చేశారు. వీరిలో చీరాలకు చెందిన గుర్రం సాయి శ్రావణి జాతీయస్థాయిలో బెంగళూరులో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో ఉత్తమ ఇంటీరియర్ డిజైనర్‌గా అవార్డు అందు కున్నారు. అవార్డు అందుకున్న సాయి శ్రావణిని రోటరీ అధ్యక్షులు మామిడాల శ్రీనివాసరావు, మహాత్మా గాంధీ క్లాత్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు శ్రీరామ్ రాఘవయ్య, రాధాకృష్ణ మందిరం అధ్యక్షులు నల్లూరి బ్రహ్మం అభినందించారు.

లోకేష్‌ను కలిసిన సజ్జా

ప్రజాశక్తి - చీరాల



లోకేష్‌తో సజ్జా వెంకటేశ్వరరావు

యువగళం పాదయాత్రలో యువనేత నారా లోకేష్‌ను చీరాల టిడిపి నాయకులు సజ్జా వెంకటేశ్వర్లు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను జీడిపప్పు మాలతో లోకేష్‌ను సత్కరించారు. పాదయాత్ర స్ఫూర్తితో నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరవేసేందుకు తన వంతు కృషి చేస్తానని, పార్టీ విధానాలను, పథకాలను ప్రజల్లోకి తీసుకెళతానని అన్నారు.

కరపత్రాలు పంపిణీ

ప్రజశక్తి - చీరాల



టిడిపి కరపత్ర ప్రచారం

టిడిపి మహానాడు వేదికగా చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో పథకాలు వివరిస్తూ కరపత్రాలను ఇంచార్జ్ ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో ఇంటి ఇంటికి పంపిణి చేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, సత్యనారాయణ, బిట్రా శ్రీనివాసరావు, పఠాన్ బాష, రజిని, పడవల లలిత, గంజి పురుషోత్తం, కౌతరపు జనార్ధనరావు, నందం లావణ్య, ఆకురాతి సుజాత, షేక్ ఫర్వాన, పొట్టేటి రాజేశ్వరి, తిరువీదుల నారాయణమ్మ, తిరువీధుల పద్మజ పాల్గొన్నారు.

ధ్యానంతోనే మనశ్శాంతి

ప్రజాశక్తి - అద్దంకి

విజయవాడ సత్యసాయి ధ్యానమండలి సౌజన్యంతో అంతర్ముఖ యోగ శిక్షణ తరగతులు వాసవి నగర్‌లోని శ్రీ ఆర్యవైశ్య శ్రీనివాస కళ్యాణ మండపంలో గురువారం ప్రారంభించారు. బిక్షమయ్య గురూజీ చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మనసుపై కంట్రోల్ లేకుండా ఆరోగ్యం, మనశాంతి ఎన్ని కోట్లు ఖర్చుపెట్టినా లభించే ప్రసక్తే లేదని తెలిపారు. అందుకు యోగ అభ్యాసంతో కూడిన ధ్యానం నేడు సమాజానికి అవసరం అన్నారు. మహిళలకు ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో అంజద్ భాష, మన్నం త్రిమూర్తులు, సంపత్ గురూజీ, రాయపాటి సుబ్బారావు, అనిల్ కుమార్ సూరి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బిక్షమయ్య గురూజీ



అవార్డు అందుకుంటున్న మజ్నుబీబీ

షేక్ మజ్నుబీబికి బెస్ట్ అవార్డు

ప్రజాశక్తి - మద్దిపాడు

మండలంలోని బసవన్నపాలెం హై స్కూల్ హిందీ పండిట్ డాక్టర్ షేక్ మజ్ను బీబి బెస్ట్ మెంటర్ అవార్డును ఒంగోలు పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన స్వాతంత్ర దినోత్సవం వేడుకల్లో మంత్రి మేరుగ నాగర్జున చేతుల మీదుగా ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్, ఎస్‌పి మలికాగర్గ్ సమక్షంలో అందుకున్నారు. కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాంలో భాగంగా ఈ అవార్డును అందుకున్నట్లు డా షేక్ మజ్ను బీబి తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు ఉన్నత లక్ష్యసాధన వైపు పయనించి వారి భవిష్యత్తులో వారికి నచ్చిన రంగంలో స్థిరపడాలనేదే ఈ ప్రోగ్రాం లక్ష్యం అన్నారు.

ప్రభుత్వ భవనాలను త్వరగా పూర్తి చేయాలి

విధి నిర్వహణలో నిర్లిప్తతను సహించం ● పనిచేయని ఏఈలకు షోకాజ్ నోటీసులు: కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణ పనులు సెప్టెంబరు 15వ తేదీలోగా అధికారులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు పి రంజిత్‌బాషా ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలపై ఇంజినీరింగ్ అధికారులతో గురువారం స్థానిక కలెక్టరు ఛాంబర్లో సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పథకం నిధుల అనుసంధానంతో చేపట్టిన భవనాల నిర్మాణ లక్ష్యాలు చేరుకోవాలని కలెక్టరు తెలిపారు. భవన నిర్మాణాలలో ఏజెన్సీల సమస్యలు ఉత్పన్నమైతే తక్షణమే ఏజెన్సీలను మార్చాలన్నారు. గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల భవనాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున వేగంగా నిర్మించాలన్నారు. గ్రామాలకు స్థిరాస్థులుగా ఉండే ప్రభుత్వ భవనాలు నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలన్నారు. గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలు పెండింగ్‌లో ఉండడంపై కలెక్టరు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతను గుర్తించి ఇంజినీరింగ్ అధికారులు విధులు నిర్వర్తించాలన్నారు. రేపల్లె మండలంలో గ్రామ సచివాలయాల నిర్మాణ పనులు జరగకపోవడంపై పిఆర్ ఏఇని సస్పెండ్ చేయాలని సంబంధిత ఎస్ఇని కలెక్టరు ఆదేశించారు. ఎన్ని పర్యాయాలు సూచించినా పనులలో పురోగతి కనిపించకపోవడంపై ఇంజనీరింగ్ అధికారులను మందలించారు. భవన నిర్మాణాలు, విధినిర్వహణలో నిర్లిప్తంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్లపాలెం, కొరిశపాడు, సంతమాగులూరు, కారంచేడు మండలాలలో పనుల పురోగతి లేదని కలెక్టరు అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత ఏఇలకు షోకాజ్ నోటీసు జారీచేయాలని ఎస్ఇని ఆదేశించారు. జగనన్న కాలనీలలో భూమి చదును, తదితరమైన 97 పనులు పెండింగ్‌లో ఉండడంపై కలెక్టరు ఆరా తీశారు. జగనన్న కాలనీలలో 74 ఆర్చీలు నిర్మించాలని ఆయన సూచించారు. 88 ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల పనులు సత్వరమే పూర్తిచేయాలని అన్నారు. భవన నిర్మాణ పనులలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని పనులు నిలిపివేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. అధికారులు కథలు చెప్పడం మాని నిబద్ధతతో పనిచేయాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఇ హరేరామకృష్ణ, డ్వామా పిడి వైశంకర్ నాయక్, గృహనిర్మాణ శాఖ పిడి ప్రసాద్, ఆర్అండ్‌బి ఎస్ఇ, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక చట్టాన్ని బలోపేతం చేయాలి

ప్రజాశక్తి-బాపట్ల

ఎస్సీ ఎస్టీ ఉప ప్రణాళిక చట్టం నిధులు కేటాయించి ఎస్సీ ఎస్టీల బలోపేతానికి కాల పరిమితిని తొలగించాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ బాపట్ల జిల్లా చైర్మన్ దేవరపల్లి డేవిడ్ రాజ్ కోరారు. ఈ మేరకు గురువారం బాపట్ల జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషాకు దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కమిటీ సభ్యులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ ప్రతి ఆర్థిక సంవత్సరంలో మిగిలిపోయిన నిధులు తర్వాత ఏడాది దళిత గిరిజనుల అభివృద్ధికి ఉపయోగించి దళితుల చట్టాన్ని బలోపేతం చేయాలని అన్నారు. చట్టంలోని సెక్షన్ 21(1) ప్రకారం సబ్ ప్లాన్ బడ్జెట్ పర్యవేక్షణకు జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలు సక్రమంగా విధులు, బాధ్యతలు నిర్వహించే విధంగా ఆ కమిటీలో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయాలని కోరారు. సబ్ ప్లాన్ అమలుకు ప్రత్యేక యంత్రాంగాన్ని నియమించాలన్నారు. ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గూదె రాజారావు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల్లో కనీసం 50శాతం ఎస్సీ ఎస్టీ మహిళల ప్రత్యేక అభివృద్ధి పథకాలకు వెచ్చించాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ చట్టం అమలు చేసే ప్రభుత్వ ఉద్యోగులకు చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించి ఇతర కులాలలో ఉన్న సామాజిక ఆర్థిక అంతరాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు, దళిత గిరిజన బడ్జెట్ వాచ్ జిల్లా కన్వీనర్ దార్ల కోటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి ఆర్య, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ప్రతినిధులు పులిపాటి వీరయ్య, వి భగవాన్ దాస్ పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దళిత నాయకులు

స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-మార్కాపురం



మహిళలను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించాలని డిఆర్‌డిఎ వైఎస్ఆర్ క్రాంతిపథం మార్కాపురం ఏరియా కో-ఆర్డినేటర్ సుధాకర్ కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలోని సమా వేశపు హాలులో మండలంలోని విఒఎలతో సమీక్ష గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ప్రతి విఒలో సభ్యులకు ఇచ్చిన రుణాలను వందశాతం రికవరీ ప్రతి నెల జరిగేలా కృషి చేయాలని కోరారు. స్వయం సహాయక సంఘాలతో ప్రతి నెల రెండుసార్లు సమావేశాలు ఏర్పాటు చేసి, వారి సంఘం ఆర్థిక లావాదేవీలను సభ్యులకు వివరించాలని కోరారు. గ్రామాలలో చిరు వ్యాపారులను గుర్తించి వారికి జగనన్న తోడు పథకం ద్వారా అందించే రూ.10 వేలు బ్యాంకు ద్వారా రుణాన్ని ఇప్పించి రికవరీ చేయించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క విఒఎపై ఉందని అన్నారు. ఈ సమావేశంలో ఐబీ డీపీఎం కృపారావు, బ్యాంకు లింకేజ్ డిపిఎం సుబ్బారావు, మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, స్త్రీ నిధి మేనేజర్ సులోచన, ఎలొసి నాగభూషణం, సీసీలు మనోకుమారి, స్వామి, అకౌంటెంట్ నాగమణి, వివోఏలు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా ఫొటోగ్రాఫర్స్‌కు అవార్డులు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్



SECOND Prize P.V.S Nagaraju Lm:264
Title: Nandi



పట్వ అసోసియేషన్ గుంటూరు వారు ఉమ్మడి గుంటూరు జిల్లా లోని చారిత్రాత్మక కట్టడాలపై నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీల్లో బాపట్ల జిల్లా ఫోటోగ్రాఫర్స్‌కు 5 అవార్డు లు వచ్చాయి. ఈ అవార్డులలో పివిఎస్ నాగరాజు (బాపట్ల)కు 2వ ప్రైజ్, జి నాగేశ్వరరావు (బాపట్ల)కు 3వ ప్రైజ్, తమ్మా వీరబాబు (బాపట్ల)కు కన్సొలేషన్ అవార్డు, రాజు రవి (బాపట్ల)కు కన్సొలేషన్ అవార్డు, డబ్బకుటి శ్రీనివాసరావు (నిజాంపట్నం)కు కన్సొలేషన్ అవార్డు లభించాయి. బుధవారం ఏ వన్ కన్వెన్షన్ హాలు, గుంటూరులో వరల్డ్ ఫోటోగ్రఫీ డే ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్ర మంలో తులసి గ్రూప్స్ చైర్మన్ తులసి రామచంద్రప్రభు, ఉగ్గిరాల సీతారామయ్య చేతుల మీదుగా సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ ఫోటోగ్రఫీ ఒక గొప్ప కళని, ఏ కార్యక్రమానికి అయినా ఫోటోగ్రాఫర్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. సెల్ ఫోన్లు వచ్చిన తర్వాత ఫోటోగ్రాఫర్స్‌కు ఆదరణ తగ్గిందని, ఏ రాజకీయ నాయకుడైనా ఉన్నత పదవులకు వెళ్లాలంటే ఫోటోగ్రాఫర్‌ది ముఖ్య పాత్ర అని అన్నారు. ఫోటోగ్రాఫర్లను ప్రభుత్వం గుర్తించి సబ్సిడీ రుణాలు, హెల్త్ కార్డులు ఇచ్చి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఆంధ్రప్రదేశ్ ఫోటోగ్రఫీ అకాడమీ ప్రధాన కార్యదర్శి కానాల సుధాకరరెడ్డి, పట్వా అధ్యక్షులు సంక శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు షరీఫ్, కార్యదర్శి డి శంకరరావు, సహాయ కార్యదర్శి దుర్గాప్రసాద్, ట్రెజరర్ హరిబాబు, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఫోటోగ్రాఫర్లు హాజరయ్యారు.

గ్రంథాలయ అభివృద్ధికి.. శివాజీ గణేశన్ కృషి అభినందనీయం

ప్రజాశక్తి-బాపట్ల:

ప్రథమశ్రేణి గ్రంథాలయ అధికారిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే ఎక్కడ గ్రంథాలయ అధికారిగా పనిచేసినా ఆ గ్రంథాలయం అభివృద్ధికి పాటుపడే బాపట్ల శాఖా గ్రంథాలయ అధికారి అంగలకుదురు శివాజీ గణేశన్ కృషి అభినందనీయమని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ అన్నారు. గురువారం బాపట్ల శాఖా గ్రంథాలయం నూతన భవనం నిర్మాణానికి సంబంధించి శాసనసభ్యుడు కోన రఘుపతితో సమావేశమైన అనంతరం శాఖా గ్రంథాలయ అధికారిగా కలెక్టర్ నుంచి ఉత్తమ అవార్డు అందుకున్న శివాజీ గణేశన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ శివాజీ గణేషన్ బాపట్ల శాఖా గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు సౌకర్యార్థం దాతల సహకారంతో కుర్చీలు, ఫ్యాన్లు సమకూర్చారు. పాఠకులు, విద్యార్థిని విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించి గ్రంథాలయాల పట్ల వారిలో ఆసక్తి కల్పించేందుకు కళాశాలలు పాఠశాలల్లో అనేక సమావేశాలు నిర్వహించారు. నిత్యం పాఠకులకు అందుబాటులో ఉంటూ గ్రంథాలయ సేవలను అందిస్తున్న సందర్భంగా అవార్డుకు ఎంపిక చేయటం ఆయన కృషికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కె ఝాన్సీ, జెఎ వై బ్రహ్మయ్య, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాధార సంస్థను సందర్శించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్: ప్రపంచ వరి పరిశోధన సంస్థ శాస్త్రజ్ఞులు డాక్టర్ పన్నీర్ సెల్వం, డాక్టర్ సూర్యకాంత్, డాక్టర్ సునీల్ కుమార్‌లు బాపట్ల మండలం జమ్ములపాలెం గ్రామంలో ఉన్న ప్రాణాధార సంస్థను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణధార సంస్థ చేయుచున్న పొడి నేలలో 30 సెంటీమీటర్ల ఎడమ సాలలో గొర్రుతో వెద పెట్టే విధానాన్ని పరిశీలించారు. భారతదేశంలో ప్రాణాధార వారు ప్రప్రథమంగా వరి పైరులో సన్న టైర్లు బిగించిన కుబోటో చిన్న ట్రాక్టర్‌తో బురద నేలలో వరి విత్తనం విత్తుట, పొడి నేలలో, బురద నేలలో కలుపు తీయడం, ఎరువులు వేయడం, మురుగు కాలువలు వేయడం, మందులు పిచికారీ చేయు విధానం గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వరి వ్యవసాయం రైతులకు చాలా ఉపయోగమని వివరించారు. ప్రపంచ వరి పరిశోధన సంస్థ వారు ఈ నూతన విధానం భారతదేశంలోని ఇతర రాష్ట్రాలలో దక్షిణ ఆసియా ఖండంలోని ఇతర దేశాలలో విస్తరణకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రాణధార డైరెక్టర్ తుమ్మల యుగంధర్, నెక్కంటి కిరణ్ ప్రకాష్, కుర్ర పుండరీకాక్షుడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

'ఫెన్సింగ్'లో చింతాయపాలెం విద్యార్థికి స్వర్ణం

ప్రజాశక్తి-బాపట్ల

ఖేలో ఇండియా ఫెన్సింగ్ క్రీడలో చింతాయపాలెం విద్యార్థి బంగారు పతకం సాధించాడు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 12, 13 తేదీల్లో జరిగిన 9వ రాష్ట్రస్థాయి జూనియర్ లెవెల్ ఫెన్సింగ్ పోటీల్లో ఖేలో ఇండియా సెంటర్ చింతాయపాలెం, జడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి పిట్టు అయ్యప్పరెడ్డి సెబర్ టీం ఈవెంట్‌లో స్వర్ణ పతకం సాధించినట్లు హైస్కూల్ హెచ్ఎం టి వెంకటరాజు గురువారం విలేకరులకు తెలిపారు. బంగారు పతక విజేత అయ్యప్పరెడ్డి, కోచ్ చిరంజీవిలను ఖేలో ఇండియా ఫెన్సింగ్ జిల్లా కోచ్ కె పాల్‌కుమార్, చింతాయపాలెం జడ్పీ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు గోపి అభినందించారు.

ఉద్యోగుల స్పందనను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల జిల్లాలో పనిచేస్తున్న అన్ని శాఖల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా, జిల్లా జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ శుక్రవారం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ జేఏసి చైర్మన్ సిహెచ్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగుల సర్వీసు తదితర అన్ని సమస్యల పరిష్కారం కోసం స్పందనలో వినతి పత్రం ద్వారా జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని అన్నారు. ఉద్యోగులు, అన్ని సంఘాల నాయకులు ఈ ప్రత్యేక స్పందన కార్యక్రమంలో పాల్గొని సమస్యల పరిష్కారానికి దోహదపడాలని కోరారు. అలాగే ఈ ప్రత్యేక ఉద్యోగుల స్పందన కార్యక్రమం ద్వారా ఉద్యోగులకు నేరుగా జిల్లా ఉన్నతాధికారులకు, సమస్యలు చెప్పుకొనే అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, డీఆర్ఓ లక్ష్మీ శివజ్యోతికి జిల్లా రెవెన్యూ ఉద్యోగుల పక్షాన అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు.

గందరగోళంగా మండల సమావేశం

ప్రజాశక్తి-అర్ధవీడు

ప్రకాశం జిల్లా అర్ధవీడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం గురువారం వాడి వేడిగా జరిగింది. మండలంలోని సమస్యలు పట్టించుకోనే వారు లేరని నాయకులు, అధికారులను నిలదీశారు. పనులు చేస్తామని చెబుతున్నారు కాని, అభివృద్ధికి నోచుకోవటం లేదని సర్పంచులు అన్నారు. ప్రభుత్వ హైస్కూల్లో కిచెన్ వాష్ రూమ్‌లు అపరిశుభ్రంగా ఉన్నాయని ఎండిఓ-2 లక్ష్మీనాయక్‌ను అర్ధవీడు సర్పంచి వసంతమ్మ నిలదీశారు. అర్ధవీడు జడ్పిటిసి విజయమ్మ, ఎంపిపి వెంకట్రావు, ఎమ్మార్వో పి ఉమారాణి, ఏవో సాంబశివరావు, ఎంపిటీసీలు తదితరులు పాల్గొన్నారు.



సగిలేరు సప్లయ్ ఛానల్‌ను పరిశీలన

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్: గిద్దలూరు జలవనరుల శాఖకు చెందిన సగిలేరు సప్లై ఛానల్ కట్టను రియల్ ఎస్టేట్ వ్యాపారి ఎలాంటి అనుమతులు లేకుండా కట్టను ధ్వంసం చేసి రోడ్డు నిర్మాణం చేసి వర్షం నీళ్ళు పోవడానికి సిమెంటు పైపులు నిర్మాణం చేశారు. విషయం తెలుసుకున్న గిద్దలూరు తహసీల్దారు సీతారామయ్య, ఇరిగేషన్ ఏఇ, మున్సిపల్ కమిషనర్‌లతో కలిసి పొలం వద్దకు వెళ్లి పరిశీలించారు. ఎంత మేర జలవనరుల శాఖ భూమి ఆక్రమణకు గురైందో వాటి వివరాలు తెలపాలని మండల సర్వేయర్‌కు ఆదేశాలు ఇవ్వడంతో సర్వేయర్ కొలతలు వేశారు. మొదట్లో 3 అడుగులు, చివర్లో 14 అడుగుల మేర సగిలేరు సప్లయ్ ఛానల్ కట్ట ఆక్రమణ జరిగిందని జలవనరుల శాఖ ఏఇ విశ్వనాథ్ తెలిపారు. ఆక్రమణకు గురైన సప్లైఛానల్ కట్ట పునరుద్ధరించాలని, సగిలేరులో కొట్టిపడేసిన ముల్లచెట్లునంతా తొలగించాలని, కట్టకు అడ్డంగా నిర్మించిన పైపులను తొలగించాలని తహశీల్దారు రియల్ ఎస్టేట్ వ్యాపారి కోట శ్రీనివాసులుకు ఆదేశాలు జారీ చేశారు.

అందరూ సమిష్టిగా పనిచేయాలి

పర్చూరు వైసీపీ నేతలతో విజయసాయిరెడ్డి సమావేశం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అందరూ సమిష్టిగా పని చేస్తూ పార్టీ అభ్యర్థుల గెలుపుకు వైసీపీ కృషి చేయాలని రీజినల్ కోఆర్డినేటర్ విజయ సాయిరెడ్డి పిలుపునిచ్చారు. పర్చూరు నియోజకవర్గ వైసీపీ ముఖ్య నేతల సమావేశం గురువారం బాపట్ల కోన భవన్‌లో జరిగింది. సమావేశంలో వైసిపి పర్చూరు ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్‌కు వ్యతిరేకంగా ఉన్న వారు ఒకవైపు, ఆమంచికి అనుకూలంగా ఉన్నవారు మరొక వైపు రెండు వర్గాలుగా విజయసాయిరెడ్డి ముందు సమీక్ష సమావేశంలో వైసీపీ నేతలు కూర్చోవడం స్పష్టంగా కనిపించింది. సమావేశం ప్రారంభంలో వ్యక్తిగత సమస్యలు వద్దు కేవలం రాజకీయ సమస్యలు మాత్రమే మాట్లాడండి అని విజయ సాయిరెడ్డి చెప్పారు. సమావేశ ప్రారంభంలో ఆమంచి మాట్లాడుతూ సమావేశం లోపల ప్రజాప్రతినిధులు కాకుండా బయట వ్యక్తులు కూడా వచ్చారని, వారిని బయటకు పంపమని విజయసాయిరెడ్డిని కోరినట్లు, అయితే అంతా వైసిపి కార్యకర్తలు, నాయకులు కాబట్టి అందరిని లోపలే ఉండమని విజయ సాయిరెడ్డి ఆమంచిని వారించినట్లు తెలిసింది. ఆమంచి మాట్లాడేటప్పుడు నియోజకవర్గంలో టిడిపి ఓట్లు 40వేలు దొంగ ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించడానికి స్థానికంగా ఎవరూ సహకరించడం లేదని చెప్పినట్లు సమాచారం. నియోజకవర్గంలో మూడున్నర



సమావేశంలో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

సంవత్సరాలుగా వైసిపి టిడిపి (రామనాథంబాబును ఉద్దేశించి) అంటకాగాయని, దానిని నివారించి పార్టీని బలోపేతం చేయడానికి తాను పర్చూరు వచ్చినట్లు చెప్పినట్లు సమాచారం. ఐపాడ్ టీం వాళ్లు కూడా తనకు ఎవరు సహకరించడం లేదని చెప్పినట్లుగా తెలిసింది. అనంతరం వివిధ మండలాల నుంచి వచ్చిన వారితో ఒక్కొక్కరిని రెండు నిమిషాల పాటు మాట్లాడించినట్లుగా తెలిసింది. ఈ క్రమంలో కారంచేడు వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు మాట్లాడుతూ కమ్మ సామాజిక వర్గాన్ని కులం పేరుతో దూషించిన ఆమంచిపై నియోజకవర్గంలో ఉన్న ఆ సామాజిక వర్గం తీవ్ర మనస్థాపానికి గురైందని చెప్పబోతుండగా రెండో వైపు నుంచి ఆమంచి వర్గీయులు పైకిలేచి యార్లగడ్డ సుబ్బారావుపై విరుచుకు పడినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో విజయసాయిరెడ్డి ఈ విధంగా మాట్లాడితే అందర్నీ బయటకు పంపించాల్సి ఉంటుందని వారిని హెచ్చరించి యార్లగడ్డ సుబ్బారావుని బయటకు పంపించినట్లు సమాచారం. దీంతో పర్చూరు నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాల్ని అధిష్టానవర్గం దృష్టికి తీసుకొచ్చేందుకు అక్కడికి వచ్చిన పలువురు అసమ్మతి వైసిపి నేతలకు తాము చెప్పాల్సింది చెప్పడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో సమావేశం ఏకపక్షంగానే జరిగినట్లు తెలిసింది. నియోజకవర్గంలో అందరూ కలిసి పార్టీని బలోపేతం చేసే విధంగా కృషి చేయాలని విజయసాయిరెడ్డి చెప్పినట్లుగా సమాచారం. అయితే చివరలో కొంతమంది అసమ్మతి నేతలు విజయసాయిరెడ్డితో వ్యక్తిగతంగా మాట్లాడిన సందర్భంలో ఆమంచి గురించి, పార్టీ వ్యతిరేక పనుల గురించి చర్చించినట్లు సమాచారం. అయితే మీరు ఆమంచి కోసం పని చేస్తారా? లేక జగన్ మోహన్ రెడ్డి కోసం పనిచేస్తారా అని విజయసాయిరెడ్డి ప్రశ్న వేసినట్లు తెలిసింది. త్వరలో మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తామని, మరికొన్ని విషయాలు అప్పుడు చర్చించుకుందామని విజయ సాయిరెడ్డి అందరితో చెప్పినట్లు సమాచారం.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

అడుగుజాడలు కథా సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి-కంభం రూరల్

అడుగుజాడలు అనే కథా సంపుటి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం గురువారం జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జమాతే ఇస్లామీ హింద్, జిల్లా బాధ్యులు గౌస్ ఖాన్ మొహమ్మద్ రఫీ, ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి షంషీర్ బేగ్ లు మాట్లాడుతూ అడుగుజాడలు అనే కథా సంపుటిలో పుస్తక రచయిత్రి కుర్ఫీద్ బేగం దేశంలో నానాటికీ మారుతున్న పరిస్థితులు, విడివడుతున్న మానవ సంబంధాలు, చెదిరిపోతున్న సమైక్యత గురించి చాలా చక్కగా వివరించారన్నారు. దేశ వ్యవస్థను హస్తగతం చేసుకున్న కొన్ని శక్తులు ఉద్దేశపూర్వకంగానే ముస్లిముల పట్ల అపోహల్ని వ్యాపింపజేశాయని, ముస్లింలను హింసా వాదులుగాను, ద్వేషవాహకులుగాను చిత్రీకరిస్తూ మెజారిటీ మత సమాజంలో భయాన్ని సృష్టించి తమ పబ్బం గడుపుతున్న సంగతి అందరికీ తెలిసిందే అన్నారు. అంతేకాక సమాజంలో సామాజిక దురాచారాలను, అవినీతిని సైతం ఎండగడుతూ సమాజంలో జరుగుతున్న మోసాలను, కుతంత్రాలను తన కథల రూపంలో ఖుర్షిద్ బేగం చాలా సమర్థవంతంగా వివరించారన్నారు. ముస్లిం సమాజంపై ముప్పేట ముసురుకుంటున్న అపోహల కారు మబ్బుల్ని పటాపంచలు చేస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ ప్రకాశం జిల్లా బాధ్యులు గౌస్ ఖాన్, మొహమ్మద్ రఫీ, ఆసిఫ్ ఖాన్, అబ్దుల్లా, రసూల్ బేగ్, ప్రకాశం జిల్లా ఆవాజ్ కమిటీ కార్యదర్శి షంషీర్ బేగ్, జమాతే ఇస్లామీ హింద్ కార్యకర్తలు కరిముల్లా, జాఫర్ ఖాన్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

20 ఎస్సీ కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-అర్ధవీడు

ప్రకాశం జిల్లా, గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి ఇన్‌ఛార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో అర్ధవీడు మండలం రంగాపురం గ్రామానికి చెందిన 20 ఎస్సీ కుటుంబాలు టిడిపి మండల అధ్యక్షులు బండ్లమూడి ఆంజనేయులు యాదవ్ ఆధ్వర్యంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎన్నికలకు ముందు ఎస్సి సోదరులకు ఈ వైసిపి పెద్దలు కల్లబొల్లి మాటలు చెప్పి వారి ఓట్లతో అధికారంలోకి వచ్చి మొదటి రోజు నుంచి ఎస్సీ సోదరులపై రాష్ట్రంలో నిత్యం ఏదో ఒకచోట దాడులు చేస్తూ వారిని వేధించడమే పనిగా పెట్టుకుందని అన్నారు. నాడు తెలుగుదేశం హయాంలో వారి సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను రద్దుచేసి ఎస్సి సోదరులకు వెన్నుపోటు పొడిచిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎస్సీ సోదరులు ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తారని తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలిచి గిద్దలూరు నియోజకవర్గంలో అశోక్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీలో చేరిన ఎస్సీలు గొట్టిముక్కల రామ్మోహన్, చాట్ల రాజారత్నం, పానుగంటి బాబు, సురేష్, గిలిగిత్తల నడిపయ్య, రాజులయ్య, విజయ్, తిమ్మరాజు, సుధాకర్, తిరుమలేశు, ఏసోబు, గిలిగిత్తల మాత్యూస్, బండి చెన్నయ్య, దొర కొండయ్య, గడే చిన్న పిచ్చయ్య, వేశపోగు చిరంజీవి, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ మారెడ్డి రంగారెడ్డి, మండల బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లాకా రమణ యాదవ్, మీనిగె రాము, సయ్యద్ బాషా, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అందుబాటులో టీటీడీ కల్యాణ మండపం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు పిఆర్ కాలనీ, కోర్టు భవన సముదాయాల పక్కనగల తిరుమల తిరుప తి దేవస్థానం కల్యాణ మండ పం నేటి నుంచి ప్రజలకు అందుబాటులోకి రానున్నది. విజయలక్ష్మి సప్లయర్స్ యజమా ని ముండ్ల బుజ్జి నిర్వహణలో టిటిడి కళ్యాణ మండపం కొనసాగనున్నది. ఇది అందుబాటులోకి వచ్చినందుకు గిద్దలూరు ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

పాఠశాలలు తనిఖీ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు



పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న జడ్‌పిటిసి రత్నభారతి

మండలంలోని మద్దిరాలపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, చేకూరపాడులోని ఉన్నత పాఠశాలను జడ్‌పిటిసి డాక్టర్ యాదాల రత్న భారతి గురువారం తనిఖీ చేశారు. ఇంగ్లీష్ మీడియం విద్య ప్రతి విద్యార్థికి అందించాలని పాఠశాల సిబ్బందికి తెలియజేశారు. జగనన్న గోరుముద్ద ద్వారా అందించే పౌష్టికాహారాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తూ ఉత్తమ భోదన అందించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి బాగా చదివి తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేసేలా, ప్రతి విద్యార్థి చదువుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టి విద్యార్థులకు అవసరమైన వైద్యం అందించాలని ఏఎన్‌ఎం చంద్రకళకు జడ్‌పిటిసి తెలియజేశారు. విద్యార్థుల ఎత్తు, బరువు పరిశీలించి రక్తహీనత తక్కువగా ఉన్న పిల్లలకు టాబ్లెట్లు అందించారు. చేకూరపాడు పాఠశాలలో తొమ్మిది మంది బోధన సిబ్బంది కావాలని తెలుపటంతో వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారంకు కృషి చేస్తామన్నారు. విద్యార్థులు స్కూల్ యూనిఫామ్ ధరించి గ్రామానికీ, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకు రావాలన్నారు. నాడు నేడు ద్వారా జరిగిన అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు రామారావు, అనియత విద్యా కమిటీ చైర్మన్ మయూరి పృథ్వీరాజ్, ఆశ వర్కర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాకల గ్రామ పంచాయతీ

ఉప ఎన్నికలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-శింగరాయకొండ



ఏర్పాట్లు చూస్తున్న పోలీసులు

శింగరాయకొండ మండలంలోని పాకల గ్రామపంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఈ నెల 19వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పాకల గ్రామపంచాయతీ సర్పంచ్, శింగరాయకొండ గ్రామ పంచాయతీ 16వ వార్డు మెంబర్, మూలగుంటపాడు 10వ వార్డు మెంబర్ స్థానాలకు ఉపఎన్నికలు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఎన్నికల అధికారులకు గురువారం శిక్షణ నిర్వహించారు. సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ టి శ్రీరామ్ ఆధ్వర్యంలో ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికలకు అధికారులు అన్నీ సిద్ధం చేసుకున్నారు. ఇక పాకల సర్పంచ్ ఎన్నికలకు వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు రెండు రోజుల నుంచి అక్కడే మకాంవేసి వైసిపి మద్దతు సర్పంచ్ అభ్యర్థి కురు ప్రసన్నకుమార్ కోసం ప్రచారాన్ని ముమ్మరంగా చేస్తున్నారు. తెలుగుదేశం అభ్యర్థి సైకం చంద్రశేఖర్ గెలుపు కోసం శింగరాయకొండ మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు.

అసైన్డ్ భూములపై అర్హులకే హక్కు కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములపై అర్హులైన పేదలకే హక్కు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూ సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిపై హక్కులు కల్పిస్తామని ప్రభుత్వం చెబుతున్నదని ఎట్టి పరిస్థితుల్లో అన్యాక్రాంతం చేసిన అనర్హులకు ఆ భూములపై హక్కు కల్పించరాదని ఆయన అన్నారు. పేదలకు భూములు పంచాలని, దున్నేవారికి భూమి దక్కాలని వ్యవసాయ కార్మిక సంఘాలు, వామపక్షాలు చేసిన అనేక పోరాటాల ఫలితంగా పేదలకు ప్రభుత్వాలు భూములు పంచాయని తెలిపారు. 1954 నుంచి ఉమ్మడి రాష్ట్రంలో 58 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేశారని ఆయన అన్నారు. అందులో అత్యధిక భాగం అన్యాక్రాంతం అయ్యిందని ప్రభుత్వ లెక్కలే తెలుపుతున్నాయన్నారు. దానిని అరికట్టేందుకు 9/77 చట్టం వచ్చిందని తెలిపారు. ఈ చట్టం ఉన్నా కూడా భూములు



ధర్నాలో మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

అన్యాక్రాంతమయ్యాయని నేడు రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన చట్టం ప్రకారం పేదల దగ్గర భూమి మిగిలే అవకాశం లేదని అన్నారు. భూములపై హక్కులు కల్పించడం పేదలకు మంచిదేనని, అమ్ముకునే హక్కు కల్పిస్తే పేదల దగ్గర సెంటు భూమి మిగిలే అవకాశం లేదని ఆయన అన్నారు. ఐదు ఎకరాలకు మించి మెట్ట భూమి, రెండున్నర ఎకరాలకు మించి మాగాణి భూమి కలిగినటువంటి వారికి ప్రభుత్వ భూమి పొందే హక్కు లేదనే విధంగా 9/77 చట్టంలో ఉందని, దాని ప్రకారమే అనర్హులకు ప్రభుత్వ భూములపై హక్కు లేకుండా చేయాలని, అనర్హుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని, అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో భూములకు విలువ పెరిగినందున పేదల వద్దనున్న భూమిని గ్రామాల్లో ఉన్న రాజకీయ పార్టీల నేతలు, రియల్ ఎస్టేటర్లు అదిరించి, బెదిరించి, రకరకాల ప్రలోభాలకు గురిచేసి పేదల వద్ద నుంచి భూమిని కాజేశారని అన్నారు. ప్రభుత్వం నేడు తెస్తున్న చట్టం అనర్హులకు హక్కు కల్పించే విధంగా ఉందని ఆయన అన్నారు. ఈ చట్టాన్ని సవరించి అనర్హులకు భూమి దక్కకుండా, పేదలకు దక్కేలా మార్పులు చేయాలని కోరారు. తాతల తండ్రుల తరాల నుంచి కుంటపోరంబోకు, వాగు పోరంబోకు, చెరువు పోరంబోకు భూములను పేదలు సాగు చేసుకుంటున్నారని, అవే జీవనాధారంగా బతుకుతున్న వారికి ఆ భూములపై సాగు హక్కు కల్పించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ ఎస్-ఎల్‌వి నారాయణరెడ్డికి అర్జీ ఇచ్చారు. ఈ ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అన్నవరపు శేషారావు, మండల నాయకులు పూరిమెట్ల బ్రహ్మయ్య, పోకూరి తిరుపతయ్య, ఐనంపూడి వెంకట్రావు, సుదర్శి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి

శుక్రవారం 18 ఆగస్టు 2023

కౌలు రైతులకు పంట రుణాలివ్వాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ డిమాండ్

ప్రజాశక్తి - రేపల్లె

కౌలు రైతులకు వెంటనే రుణాలు ఇవ్వాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 80వేల కౌలుకార్డులు ఇవ్వాలని నిర్ణయించిందని అన్నారు. ఇప్పటివరకు దాదాపు 60వేల కౌలుకార్డులు అందించినప్పటికి పంట రుణాలు ఇవ్వటంలో మాత్రం పూర్తిగా అధికారులు విఫలం అయ్యారని ఆరోపించారు. ఖరీఫ్ పంట కాలం ప్రారంభమైనా కూడా కౌలు రైతులను బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారే తప్ప పంట రుణాలు ఇచ్చేపరిస్థితి లేకుండా పోయిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2019పంట సాగుదారుల హక్కు చట్టం ప్రకారం కౌలు



మాట్లాడుతున్న సిపిఎం కార్యదర్శి సిహెచ్ మణిలాల్

గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదని అన్నారు. బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట రుణాలు ఇవ్వాలంటే భూ యజమాని 1బి, ఇసి పత్రాలు, భూ యజమాని ఆమోదం ఉంటేనే పంట రుణాలు ఇస్తామని బ్యాంకర్లు మొఖం మీద తెగేసి చెబుతున్నారని తెలిపారు. రిజర్వ్ బ్యాంకు నిబంధనల ప్రకారం కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ప్రభుత్వ అధికారులు బ్యాంకర్ల సమన్వయంతో సకాలంలో పంట రుణాలు ఇవ్వాలని అన్నారు. లేని పక్షంలో పంట రుణాలు ఇవ్వని బ్యాంకుల ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. విపత్తు సమయంలో పంట నష్టానికి పరిహారం అందడం లేదని అన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించట్లేదని గ్రామాల్లో కౌలు రైతులు తమ వద్ద వాపోయారని తెలిపారు. తక్షణమే జిల్లా కలెక్టరు సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారం కోసం చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకుల జి దానియేలు, డి శ్రీనువాసరావు పాల్గొన్నారు.



ఈ క్రాప్ నమోదు చేస్తున్న ఎఒ వెంకటకృష్ణ

ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - అద్దంకి

రైతులు అందరూ సాగుచేసిన పంటలన్నీ ఈ- క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మండలంలోని చినకొత్తపల్లిలో ఈ పంట నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేసుకున్నవారికి మాత్రమే వైఎస్ఆర్ ఉచిత పంటల భీమా పథకం వర్తిసుందని తెలిపారు. సున్నా వడ్డీ, పంటలకు గిట్టుబాటు ధరలు, ఇన్పుట్ సబ్సిడీ, రైతు భరోసా పథకాలన్నీ ఈ - పంట నమోదు ప్రమాణికమని తెలిపారు.

విధ్వంసాన్ని ఖండించాలి

ప్రజాశక్తి - ముద్దిపాడు

మణిపూర్‌లో జరుగుతున్న విధ్వంస కాండను ప్రతి ఒక్కరు ఖండించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉబ్బ వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని కొలసనకోట గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించడం ఆటవిక చర్య అని అన్నారు. ఈ ఘటనలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి గానీ, స్థానిక అధికారులు కానీ నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. సుప్రీంకోర్టు ముట్టికాయలు వేస్తున్నప్పటికీ దాడులు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి వెంటనే శాంతి నెలకొల్పాలని అన్నారు. కార్యక్రమంలో చలంచర్ల ప్రసాదు, శివన్నారాయణ, విజయమ్మ, నరసింహారావు, శివయ్య పాల్గొన్నారు.

గ్రేస్ ఫౌండేషన్ చేయూత

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రమైన భట్టిప్రోలులోని అద్దేపల్లికి చెందిన కసుకుర్తి ఉదయ్ కుమారి అనారోగ్యంతో మృతి చెందారు. మృతి సమాచారం తెలుసుకున్న గ్రేస్ ఫౌండేషన్ అధినేత మృతురాలి కుటుంబాన్నీ పరామర్శించారు. మానవత్వంతో మట్టి ఖర్చుల నిమిత్తం రు.5వేలు ఆర్థిక సహాయాన్ని ఫౌండేషన్ సభ్యులు యాన్సం సురేష్ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో కంభం సురేష్, యడ్ల జయసిలరావు, కిరణ్ ఉన్నారు.



వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులు చేయిస్తున్న దాత ఫిలిప్‌రాజు

వాటర్ ట్యాంక్‌ల ఏర్పాటుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మేదరమెట్ల

కొరిసపాడు మండలంని రావినూతల గ్రామంలో గల ఏడవ వార్డులో వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. నిత్యం ఆ ట్యాంకుల నుండి నీరు లీకై వృధాగా పోతున్నాయి. దీంతో స్థానికులు నీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థలో ఉన్న ట్యాంకులను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసేందుకు చాట్ల ఫిలిప్‌రాజు ఆర్థిక సహాయం చేశారు. ట్యాంకుల నిర్మాణానికి రూ. 80వేల వరకు ఖర్చు అవుతుందని తన తండ్రి చాట్ల ప్రకాశం జ్ఞాపకార్థం వీటిని నిర్మిస్తున్నట్లు దాత తెలిపారు. ట్యాంకులకు సంబంధించి పనులను గురువారం ప్రారంభించారు. రోజుల వ్యవధిలోనే కొత్తవి నిర్మించి నీటిని అందజేస్తానని తెలిపారు. తమ నీటి కష్టాలు తీర్చేందుకు ముందుకు వచ్చిన ఫిలిప్ రాజుకు వార్డు ప్రజలు, యువకులు కృతజ్ఞతలు తెలిపారు.

'గుండ్లకమ్మ' మరమ్మత్తులు చేయాలి

ప్రజాశక్తి - మేదరమెట్ల

గుండ్లకమ్మ గేట్ మరమ్మతులను వెంటనే ప్రారంభించాలని, నీటిపారు దలకు అడ్డంగా కాలువల్లో ఉన్న చిల్ల చెట్లను తొలగించాలని గుండ్లకమ్మ ఆయుకట్టు రైతు సంఘము డిమాండ్ చేసింది. రాచపూడి సచివాలయ వద్ద సంఘం ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం అవుతున్నా గుండ్లకమ్మ గెట్ మరమ్మత్తు చేయక పోవడంతో ఆయకట్టు రైతంగం నష్ట పోయే ప్రమాదం ఉంద న్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పాలేరు వీరాంజనేయులు, తలపనేని శ్రీనివాసరావు, బొడ్డు శ్రీనివాసరావు, బాచిన రవికుమార్, చావా కోటేశ్వరరావు, నందికోలు సుబ్బారావు, చావా లక్ష్మీనారాయణ ఉన్నారు.



అర్జీ ఇస్తున్న రైతులు

గ్రామీణ వైద్యులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

ప్రస్తుత వాతావరణ మార్పులు, కోవిడ్ వల్ల అంతు చిక్కని రోగాలు వస్తున్నాయని డాక్టర్ రెడ్డీస్ లేబోరేటరీ రీజనల్ కోఆర్డినేటర్ షేక్ మస్తాన్‌వలి సూచించారు. హెల్త్ ఫస్ట్ ఎయిడర్స్ వెల్ఫేర్ సొసైటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ వైద్యుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చలి, జ్వరం, తలనొప్పి వంటి వ్యాధులు కరోనా అనంతరం తీవ్రంగా పెరిగాయన్నారు. మితిమీరిన యాంటిబయాటిక్స్ మందులు వాడకూడదని సూచించారు. వైద్యుల సలహాలమేరకు మాత్రమే మందులు వాడుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సదస్సులో డాక్టర్ రెడ్డీస్ లేబరోటరీ ఎగ్జిక్యూటివ్ పవన్ కుమార్, సొసైటి అధ్యక్షులు రావినూతల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కరుణ సప్తతి పుస్తకావిష్కరణ చేస్తున్న జ్యోతి చంద్రమౌళి

కరుణ సప్తతి పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - అద్దంకి

కరోనా ముందు కాలం - కరోనా తరువాత కాలం అనే విధంగా ఈనాటి సమాజం కొనసాగుతుందని ఉబ్బా దేవపాలన అన్నారు. బొమ్మనంపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో చారిత్రక పరిశోధకులు జ్యోతి చంద్రమౌళి రచించిన కరుణ సప్తతి పుస్తకాన్ని రావినూతల నారాయణరావు ఆవిష్కరించారు. సభకు పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సభలో ప్రముఖ కవి డివిఎం సత్యనారాయణ ఎంతో అద్భుతంగా పుస్తక సమీక్ష చేశారు. తొలి పుస్తకాన్ని గుర్రం రామయ్య స్వీకరించారు. కార్యక్రమంలో డాక్టర్ గాలంకి అశోక్ బాబు, లైవ్ ప్రసాద్, రోటరీ ప్రెసిడెంటు చిన్ని మురళీ, సెక్రటరీ చప్పిడి వీరయ్య, శ్రీ దాస భారతీయ జానపద కళాక్షేత్రం అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు, జ్యోతి శ్రీమన్నారాయణమూర్తి పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు చేపట్టని వాళ్లకు నోటీసులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

జగనన్న కాలనిలలో గృహనిర్మాణాలు చేపట్టని లబ్దిదారులకు నోటీసులు ఇవ్వాలని మండల ప్రత్యేక అధికారి హనుమంతరావు స్థానిక అధికారులను ఆదేశించారు. గృహనిర్మాణాలపై ఎంపిడిఒ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, గృహనిర్మాణ శాఖ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే డ్వాక్రా ద్వారా రు.35వేలు పొంది నిర్మాణాలు చేపట్టని వారి నుండి సొమ్మును రికవరి చెయ్యాలని సూచించారు. ప్రతి లబ్దిదారుడు గృహనిర్మాణం చేపట్టే విధంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు అవగాహన కల్పించాలన్నారు. గృహ నిర్మాణం చేపట్టే వారికి మరుగుదొడ్డికి కూడా రు.12వేలు అందజేస్తామని తెలిపారు. పునాది కాగానే రూ.5వేలు పూర్తి చేసిన తర్వాత రూ.7వేలు జమ చేస్తామని అన్నారు. ఇప్పటి వరకు ఇళ్ల నిర్మించని వారికి నోటీసులు ఇవ్వాలని అన్నారు. ఏడు రోజులలోగా నిర్మాణాలు చేపట్టకపోతే మంజూరు చేసిన స్థలం రద్దు చేస్తామని నోటీస్ ద్వారా తెలిపినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపిడిఓ జలజ, హౌసింగ్ ఎఈ సౌమ్య రేవతి ఉన్నారు.

పాడి పశువుల పట్ల జాగ్రత్తలు వహించాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పాడి పశువుల పట్ల రైతులు తగిన జాగ్రత్తలు వహించాల ని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి హనుమంతరావు సూచించారు. స్థానిక అద్దేపల్లి రైతు భరోసా కేంద్రంలో గురువారం పశు విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఏడాదికి ఒక దూడను పొందటానికి అవసరమైన సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలని అన్నారు. పాడి పశువులపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. తప్పనిసరిగా పశువులకు భీమా చేయించాలన్నారు. అనంతరం పలువురు రైతులకు పశు భీమాను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లలితకుమారి, జెడ్పిటిసి ఉదయ్ భాస్కరి, వివిఎ రజని, నాయకులు చెన్నయ్య, మల్లేశ్వరరావు ఉన్నారు.



వేపచెట్ల వేలం నిర్వహిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నూరేళ్ల నాటి వేపచెట్లు వేలం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణాన్ని ఆధునీకరించే పనుల్లో భాగంగా స్థానిక బంగ్లా రోడ్డును విస్తరణ చేపట్టారు. రోడ్డును బాగా వెడల్పు చేసి మధ్యలో డివైడర్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూరేళ్ల నాటి వేపచెట్లు రోడ్డు విస్తరణకు అడ్డమయ్యాయి. దీంతో ఆ చెట్లను తొలగించాల్సి వస్తుంది. రోడ్డు విస్తరణ పనుల సమయంలో కొందరు కోర్టును ఆశ్రయించారు. తాత్కాలికంగా విస్తరణలో ఆస్తి కోల్పోకుండా కాపాడుకున్నారు. ఈ పాటికే రోడ్డు విస్తరణ సమయంలో కొన్ని చెట్లను తొలగించారు. చెట్ల తొలగింపును ప్రకృతి, పర్యావరణ ప్రేమికులు లబో దిబో అన్నా పట్టించుకున్న పరిస్థితి లేదు. రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న మరో 17వేప చెట్లకు గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద కమీషనర్ బి శ్రీనివాసులు బహిరంగ వేలం నిర్వహించారు. 7గురు వేలంపాటలో పాల్గొన్నారు. పాలేపోగు సుబ్బారావు అనే వ్యక్తి రూ.60వేలకు దక్కించుకున్నారు. అద్దంకి చరిత్రకు సజీవ సాక్ష్యంగా ఉన్న మిగతా వృక్షాలు కనుమరుగు కానున్నాయి. కార్యక్రమంలో పురపాలక సంఘం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహశీల్దారు, ఆదర్శవేదిక నేతలు

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

ప్రజాశక్తి - రేపల్లె

పచ్చనిచెట్లు ప్రగతికి మెట్లని తాసిల్దార్ డి మల్లికార్జునరావు అన్నారు. తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో పట్టణ ఆదర్శ వేదిక కార్యదర్శి యడ్లపల్లి కిషోర్ ఆధ్వర్యంలో పచ్చని చెట్లు ప్రగతి మెట్లు పోస్టర్లను ఆవిష్కరించారు. పచ్చదనం, పర్యావరణం సకల జీవకోటి మనుగడుకు ఎంతో ఉపయోగమన్నారు. పచ్చదనాన్ని కాపాడుకొనే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించుకోవాలని సూచించారు. అటవీ సంపద కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. మంచి ఆక్సిజన్ తీసుకుని ఆరోగ్యంగా ఉండాలంటే పర్యావర ణం కాపాడుకోవాలని అన్నారు. చెట్లను పెంచితే సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని అన్నారు. కార్యక్రమంలో కె నటరాజ్, పి కుమారి కె రాంబాబు, ఎం కృష్ణ పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎంపిపి లలితకుమారి

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్వతంత్ర దినోత్సవం వేడుకల్లో బాపట్ల కలెక్టర్ రంజిత్ భాషా నుండి ఉత్తమ అవార్డ్ పొందిన ముగ్గురు సిబ్బందిని గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నుండి బెస్ట్ టెక్నికల్ అసిస్టెంట్‌గా పి సుధీర్, బెస్ట్ పిల్డ్ అసిస్టెంట్‌గా పెదపులివర్రు పిల్డ్ అసిస్టెంట్ నాగ శ్రీ, డిఆర్‌డిఏ నుండి బెస్ట్ సిసిగా రజని అవార్డ్ లు అందుకున్నారు. వీరిని ఎంపిపి డివి లలితకుమారి, జెడ్పిటిసి టి ఉదయ్ భాస్కరి సాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎండిఓ ఎం జలజ, ఈఓ పిఆర్ డి ఉహారాణి, ఏపిఎం శ్రీమన్నారాయణ, ఎంపిటిసి సాంబమ్మ, నాయకులు మల్లేశ్వర రావు, సుధాకర్ ఉన్నారు.

జిల్లాకు రూ.35.45 కోట్ల టిటిడి నిధులు

- ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి హయాంలో విడుదల

- కల్యాణ మండపాలు, దేవాలయాల ఆధునీకరణకు వినియోగం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో



సీనియర్ నాయకులు వైవి.సుబ్బారెడ్డి టిటిడి ఛైర్మన్‌గా పనిచేసిన నాలుగేళ్ల కాలంలో జిల్లాలోని ప్రజాప్రతినిధుల విజ్ఞప్తుల మేరకు రూ.35.45 కోట్ల టిటిడి నిధులతో వివిధ పనులు మంజూరయ్యాయి. వీటితో పురాతన దేవాలయాల ఆధునీకరణ, వెంకటేశ్వరస్వామి దేవాలయాల నిర్మాణంతో పాటు కల్యాణ మండపాలను మంజూరు చేశారు. నాలుగేళ్ల కాలంలో జిల్లాలోని శాసనసభ్యులు, మండల ప్రజాప్రతినిధుల కోరిన మేరకు ఈ పనులకు నిధులు మంజూరు చేసినట్లు మాజీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి ప్రజాశక్తికి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలలో 64 భజనమందిరాలకు రూ.6.40 కోట్లు మంజూరు చేశారు. నూతనంగా 9 కళ్యాణమండపాలు మంజూరు చేశారు. వీటి కోసం రూ.17.20 కోట్లు మంజూరయ్యాయి. మేదరమెట్ల, దర్శి, మండ్లమూరు, కనిగిరి, పామూరు, సింగరాయకొండ, త్రిపురాంతకం, నాగులుప్పలపాడు, నూతలపాడులో కల్యాణమండపాలు మంజూరయ్యాయి. కొత్త దేవాలయాలు, దేవాలయాల మరమ్మత్తుల కోసం రూ.11.84 కోట్లు కేటాయించారు. అద్దంకి పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయానికి రూ.3.30 కోట్లు కేటాయించారు. శింగర కొండకు రూ.2 కోట్లు, మేదరమెట్లలోని గుడికి రూ.25 లక్షలు, పురాతన దేవాలయాలున్న మణికేశ్వరంలోని శివాలయానికి రూ.25 లక్షలు, అనమనమూరులో గుడి ఆధునీకరణకు రూ.25లక్షలు కేటాయించినట్లు వైవి తెలిపారు. గిద్దలూరు నియోజకవర్గంలోని నెమలిగుండ్ల రంగనాయకస్వామి గుడి వద్ద మల్టీ కాంప్లెక్సుకు రూ.2 కోట్లు కేటాయించారు. కొమరోలు మండలం, బదినేపల్లిలోని గుడికి రూ.55 లక్షలు, కందుకూరులో అంకమ్మగుడి రాజద్వారానికి రూ.25 లక్షలు, పొన్నలూరు మండలంలోని కొదండరామస్వామి గుడికి రూ.52 లక్షలు కేటాయించారు. ఎండ్లూరులోని కొత్తగా నిర్మించే గుడికి రూ.1.50 కోట్లు కేటాయించగా.. వైపాలెం నియోజకవర్గంలోని రాజంపల్లిలో దేవాలయానికి రూ.70 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. అన్ని నియోజకవర్గాలకు ఈ నిధులను మంజూరు చేసినట్లు మాజీ ఛైర్మన్ వైవి వెల్లడించారు.

అవయవదానం సన్నద్ధతపై సంతృప్తి

జిజిహెచ్‌లో సౌకర్యాలు పరిశీలించిన రాష్ట్ర బృందం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎపి జీవన్‌దాన్ అవయవదానం సన్నద్ధత, సౌకర్యాలపై రాష్ట్ర బృందం సంతృప్తిని వ్యక్తం చేసింది. గుంటూరు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉమా జ్యోతి, అనస్తీషియా ప్రొఫెసర్, హెచ్ఒడి డాక్టర్ కెపి పోలయ్య, న్యూరో సర్జరీ ప్రొఫెసర్, హెచ్ఒడి డాక్టర్ కెవివి సత్యనారాయణ గురువారం అవయవదానం సన్నద్ధతపై ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని సౌకర్యాలను పరిశీలించారు. అవయవదానానికి సంబంధించి పద్ధతులు, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌లోని సౌకర్యాలను పరిశీలించారు. బ్రెయిన్ డెడ్ నిర్ధారణకు డాక్టర్ల బృందంతో కమిటీ వేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఒంగోలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌బాబుతో పలు విషయాలపై వీరు చర్చించారు. గతంలో రిసోర్స్‌పర్సన్‌గా పని చేసిన విషయాన్ని ప్రస్తావించారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.భగవాన్ నాయక్ మాట్లాడుతూ ఈ వారంలో 40 మంది అవయవ దానం కోసం దరఖాస్తు చేసుకున్నారని, అవయవ దానంపై అవగాహనకు నర్సింగ్ విద్యార్థులతో పలు కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. సమావేశంలో నోడల్ అధికారి డాక్టర్ ఈ జయసుందరం, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బాలాజీ నాయక్, ఆర్ఎంఒ డాక్టర్ చైతన్య వర్మ, వివిధ విభాగాల హెచ్ఒడిలు పాల్గొన్నారు



జిజిహెచ్‌లో పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం



మాట్లాడుతున్న రామన్న

గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల చేయాలి: డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల చేసి అభ్యర్థుల వయోపరిమితి 47 సంవత్సరాలకు పెంచాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో డివైఎఫ్ఐ ప్రకాశం జిల్లా కమిటీ సమావేశం గురువారం జరిగింది. సమావేశానికి డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కెవి పిచ్చయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా రామన్న మాట్లాడుతూ రాష్ట్రంలో 2.43 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు మాట్లాడుతూ ఖాళీ పోస్టులకు జాబ్ క్యాలెండర్ ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు పల్నాడు నరేంద్ర, పల్లాల కిరణ్, పిల్లి విజయ్ పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులకు ప్రభుత్వం అన్యాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యుత్ ఉద్యోగులు, కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేసిందని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు విమర్శించారు. బుధవారం చేసిన వేతన ఒప్పందాన్ని వారు వ్యతిరేకించారు. పోరాటాన్ని కొనసాగించాలని విద్యుత్ ఉద్యోగులు, కార్మికులకు పిలుపునిచ్చారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి, ఏఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ ఎంఎస్ సాయి, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ మోహన్, టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు గోగినేని రామారావు, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు ఉంగరాల శ్రీనివాసరావు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కొరకు గత మూడు నెలలుగా విద్యుత్ రంగంలో ఐక్య పోరాటాలు జరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల పట్ల సానుకూలంగా స్పందించకుండా యూనియన్ల మధ్య చీలిక తెచ్చి కొన్ని యూనియన్లని భయపెట్టి బలవంతపు ఒప్పందం చేసిందన్నారు. ఈ ఒప్పందానికి ఇంజినీర్ల సంఘాలు, కాంట్రాక్ట్ సంఘాలు అంగీకరించలేదన్నారు. ఉద్యోగుల, కార్మికుల పోరాటానికి మద్దతు తెలియజేయవలసిందిగా కేంద్ర కార్మిక సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు.

కీచక గురువు

- విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

- సహకరించిన పిఇటి మాస్టర్

- దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

- పుల్లలచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘటన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పుల్లలచెరువులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు రామకృష్ణకు గురువారం పాఠశాల వద్ద పుల్లలచెరువు గ్రామ ప్రజలు దేహశుద్ధి చేశారు. పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. 9, 10 తరగతులు చదివే విద్యార్థినులను రెస్ట్ రూం వద్దకు ప్రత్యేక క్లాసులు చెబుతామని పిలిచి అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు వారిపై ఎక్కడ పడితే అక్కడ చేతులు వేస్తున్నారని తమ పిల్లలు తమ వద్ద వాపోయినట్లు తల్లిదండ్రులు తెలిపారు. రామకృష్ణను, అతడికి సహకరించిన పిఇటి మాస్టర్ బాలునాయక్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని ధర్నాకు దిగారు. వీరిద్దరిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా అధికారులు ఈ వ్యవహారంపై విచారణ జరిపినట్లు తెలిసింది. విద్యార్థినుల పట్ల ఇక్కడకు ఇటీవల కాలంలో బదిలీపై వచ్చిన ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు రామకృష్ణతో పాటు మరో పీఈటీ ఉపాధ్యాయుడు బాలునాయక్‌పై తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఉపాధ్యాయులు విద్యాబోధన వదిలేసి.. విద్యార్థినులను పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి కీచకులు ఉండడం విద్యా వ్యవస్థకే అవమానకరమని విద్యావేత్తలు మండిపడుతున్నారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి సదరు ఉపాధ్యాయులను సర్వీస్ నుండి తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు. ఈ ఘటన విషయమై ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వరరావును వివరణ కోరగా జరిగిందంతా ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు.



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

పర్మినెంట్ చేయాలని

మున్సిపల్ కార్మికుల మానవహారం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు గురువారం స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడారు. కార్మికుల ఆందోళనకు స్పందించిన మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఈ నెల పదిన సచివాలయంలో యూనియన్ నాయకులతో చర్చించారని వివరించారు. మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, చనిపోయిన, ఆరోగ్యం బాగలేని కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులు పని చేసుకునే విధంగా అవకాశం కల్పిస్తామని మంత్రి చెప్పారన్నారు. మంత్రి ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచుకోకపోవడం శోచనీయమన్నారు. డిమాండ్ల నెరవేర్చాలని రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు తమ ఆందోళనలు, పోరాటాలు ఉధృతం చేయాలని యూనియన్ పిలుపునివ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 21న స్కూటర్ ర్యాలీలు, 24న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు, యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, నగర అధ్యక్ష, కార్యదర్శులు యు కుమారి, కె గోపి, నాయకులు తేళ్ల విజయమ్మ, కె బాలకృష్ణ, సింహాద్రి, సిహెచ్ అక్కేశ్వరరావు, బి చిన్నబ్బాయి, కె పద్మ, సిహెచ్ దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



మానవహారం నిర్మించిన మున్సిపల్ కార్మికులు

చనిపోయిన ఓటర్లను గుర్తించి తొలగించాలి

జేసీ శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

చనిపోయిన ఓటర్లను గుర్తించి తొలగింపుకు చర్యలు చేపట్టాలని సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు బిఎల్ఒలను ఆదేశించారు. ఒంగోలు నగరం, 50వ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో జరుగుతున్న ఓటర్ల జాబితా పరిశీలనను ఆయన గురువారం పర్యవేక్షించారు. 70వ సచివాలయ పరిధిలోని 39, 40, 41 పోలింగ్ బూత్‌లలో జరుతున్న ఓటరు జాబితా పరిశీలనపై జెసి కె.శ్రీనివాసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ కలెక్టర్ చేసిన సూచనలను పాటించాలని, చనిపోయిన వారి ఓట్లు గుర్తించాలని కోరారు, కొత్తగా వివిధ ప్రాంతాలనుండి ఈ ప్రాంతానికి వచ్చినవారి ఓట్లు పరిశీలన, ఈ ప్రాంతం ఉండి వెళ్లి పోయినవారి వివరాలు గుర్తించాలన్నారు. ఒక బూత్ ఉండవలసిన ఓట్లు వేరే బూతులో ఉంటే గుర్తించి సరి చేయాలని బిఎల్ఒలకు సూచించారు. వివిధ పార్టీల బిఎల్ఏలను చేస్తున్న పరిశీలనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, ఒంగోలు తహశీల్దార్ పి.మురళి, ఒంగోలు కార్పొరేషన్ టిపిఒ వేణు, వైసిపి పరిశీలకుడు దామరాజు క్రాంతికుమార్, 50 డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, టిడిపి ఎస్.శ్రీనివాసరావు వైసిపి బిఎల్ఏ మారుతీరావు, కొండలు, టి.రవి, టిడిపి బిఎల్ఏలు సోమిశెట్టి శ్రీనివాసరావు, కె.కపారావు, ఎన్.హనుమంతరావు, బిఎల్ఒలు వి. రాధ, జి.నళిని, డి.శశిదర్, డిఎస్ సమంత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు